




పుష్పాలదరహో..

కడియంలో సీజనల్ సందడి

పూల కడియం ఎందుకు అంటారో తెలియాలంటే సరిగ్గా ఇప్పుడే అక్కడకు వెళ్లాలి. ఈ సీజనల్ పుష్పాలకు ఇదే సరైన సమయం. ఏ నర్సరీ చూసినా విరబూసిన సుమాల సొబగులు మనసు దోచేస్తాయి. హరివిల్లు సైతం చిన్నబోయే ఆ అందాలను మీరూ చూసేయండి మరి.. - 6లో



దోపిడీకి..ద్వారం!



కాకినాడ తీరంలో ఓడ

బార్జీని లాక్కెళుతున్న బోటు

కాకినాడలో కుంభకోణాలు

- నాడు వైసీపీలో అక్రమార్కులు..
- రేషన్ బియ్యం స్మగ్లింగ్
- సీపోర్టులో వాటాల వశం
- రెండు అక్రమాలపై సిట్, సీఐడీ
- ప్రభుత్వం మారి..వెలుగులోకి దందా
- త్వరలో గుట్టువిప్పనున్న సిట్, సీఐడీ
- ఇప్పటికే సీ పోర్టులో దర్యాప్తు
- తాజాగా కలెక్టర్ల సదస్సులో చర్చ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ అంటే పెన్షనర్స్ ప్యారడైజ్. ఎన్నో దశాబ్దాల నుంచి ఈ నగరానికి ఆ పేరు ఉంది. కానీ ఇప్పుడు వరుస కుంభకోణాలతో కాకినాడ కాకెక్కిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని నిలువునా దోచేసి కాకినాడను కుంభకోణాల నగరంగా మార్చేశారు. దీనికి నిలువెత్తు నిదర్శనమే కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు వేల కోట్ల రూపాయల రేషన్ బియ్యం అక్రమ రవాణా.. సీపోర్టులో బెదిరించి కేవీరావు నుంచి వాటాలను బలవంతంగా లాగేసుకున్న వ్యవహారం. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సిట్..సీపోర్టు ప్రధాన వాటాదారుడు కేవీరావు నుంచి వాటాలను కొట్టేసిన వైనంపై సీఐడీని ప్రభుత్వం నియమించింది. కాకినాడతో ముడిపడి ఉన్న ఈ రెండు ఘటనలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. తాజాగా కలెక్టర్ల సదస్సులోను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ అంశాలపై చర్చించారు.

వేల కోట్లు మింగేశారు..

కాకినాడ కేంద్రంగా రేషన్ బియ్యం విదేశాలకు కొన్నేళ్లుగా యథేచ్ఛగా తరలిపోతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కులు మరింత బరితెగించారు. సీఎం జగన్‌కు సన్నిహితుడైన అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి తన సోదరుడు, అనుచరుల ద్వారా వేల కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని రేషన్ బియ్యంతో కలిపి విదేశాలకు ఎగుమతి చేసేవారు. గడచిన ఐదేళ్లు కాకినాడలోని యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టుల నుంచి ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం, ఆయన అనుచరులు లక్షల టన్నుల రేషన్ బియ్యాన్ని ఓడల్లో తరలించేశారు. రేషన్ బియ్యంతో పాటు పేదలకు రాష్ట్రప్రభుత్వం పౌష్టికాహారం కింద పంపిణీ చేసిన పోర్టిఫైడ్ బియ్యాన్ని సైతం పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేసింది. అక్రమార్కులకు బియ్యం వ్యాపారం రూ.లక్ష పెట్టుబడికి రూ.10లక్షల రాబడి సమకూరింది. వైసీపీ అధికారంలోకి రాకముందు కాకినాడ యాంక రేజ్ పోర్టు నుంచి మాత్రమే విదేశాలకు బియ్యం ఎగు మతి జరిగేది. ఆ సమయంలో 2018-2019లో ఏడాదికి పోర్టు ద్వారా 16 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగు మతి అయ్యేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారిగా ఎగుమతులు రెట్టింపయ్యాయి. అదే సమ యంలో రేషన్ మాఫియా కోరలు చాచింది.అప్పటి సీఎం జగన్‌కు సన్నిహితుడైన కాకినాడ కీలకనేత ద్వారంపూడి తన మాఫియాను రెట్టింపు చేశాడు. దీంతో కాకినాడకు నిత్యం వేల లారీల్లో రేషన్ బియ్యం రహస్యంగా గోదాముల్లో చేరేది. అప్పటి పౌరసరఫరాల సంస్థ సైతం అక్రమార్కులకు సహకరించింది. ఈ విభాగం ద్వారంపూడి తండ్రి చేతుల్లో ఉండేది.అటు రాష్ట్ర మిల్లర్ల సంఘం కూడా సోద రుడి చేతుల్లో ఉంది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా అనేక పెద్ద మిల్లులకు ఐదేళ్ల పాటు పని భారీగా పెరిగిపో యింది.వచ్చిన లక్షల టన్నుల రేషన్ బియ్యాన్ని సార్టెక్స్ మిల్లుల్లో పాలిష్ చేసి పేర్లు పెట్టి గోనెసంచుల్లో ప్యాకిం గ్‌లు చేసి పోర్టుకు తరలించేవారు.కిలో రూ.10లకు కొనుగోలు చేసి రూ.70 చొప్పున విదేశాలకు ఎగుమతి చేసి కోట్లకు కోట్లు సంపాదించారు. పౌరసరఫ రాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారికంగా చెప్పిన లెక్క ల ప్రకారం వైసీపీ చివరి మూడేళ్లలో పోర్టు నుంచి రూ.48 వేల కోట్ల విలువైన కోటి 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విదేశాలకు తరలించింది. అంటే రేషన్ మాఫియా ఏ స్థాయిలో వేళ్లూనుకు పోయిందో అర్థం చేసుకోవచ్చు.ద్వారంపూడిసోదరుడు వీరభద్రారెడ్డి, ద్వారంపూడి అనుచరుడు వినోద్ అగర్వాల్ కంపెనీ సరళ, మరో రెండు కంపెనీలు ఐదేళ్లలో ఏకంగా రూ.4,990 కోట్లకుపైగా బియ్యాన్ని విదేశాలకు అమ్మేశాయి.

అక్రమాలకు ద్వారాలు తెరిచేశారిలా..

ఏడాది	పోర్టు పేరు	తరలింపు
2018-19	యాంకరేజ్	16 లక్షల మెట్రిల్ టన్నులు
2019-20	యాంకరేజ్	19 లక్షల మెట్రిల్ టన్నులు
2020-21	యాంకరేజ్	27 లక్షల మెట్రిల్ టన్నులు
2021-22	యాంకరేజ్	29 లక్షల మెట్రిల్ టన్నులు
2022-23	యాంకరేజ్	38 లక్షల మెట్రిల్ టన్నులు
2023-24	యాంకరేజ్	24 లక్షల మెట్రిల్ టన్నులు

దోపిడీ ఎంతలా జరిగిందో ఈ ఒక్క టేబుల్ చెప్పేస్తుంది. ఎందుకంటే 2018-19 అంటే గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం 16 లక్షల మెట్రిక్ టన్నులే పోర్టు కేంద్రంగా ఎగమతులు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చూశారా.. ఎగుమతులు అమాంతం పెరిగిపోయాయి.

జ..గన్ పెట్టి.. వాటాలు కొట్టేశారు..

కాకినాడలో ప్రైవేటు పోర్టు అయిన డీప్ వాటర్ పోర్టులో ప్రధాన వాటాదారుడు కేవీ రావు. ఇతన్ని గన్‌లు పెట్టి బెదిరించి ఏకంగా బలవంతంగా వాటాలు రాయించేసుకున్న వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతోంది.అప్పటి సీఎం జగన్ ఆదేశాలతో టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి ఈ బెదిరింపుల్లో పాల్గొనడం సంచలనం రేపుతోంది.ఈ పోర్టు నిర్వహణ కన్సార్షియంలో కేవీ రావుకు 41.12 శాతం వాటా కింద 2.15 కోట్ల షేర్లు ఉన్నాయి. దీంతో ఈయన సీఎండీగా ఉన్నారు. లాభాల్లో 22 శాతం వాటా కింద రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.100 కోట్ల వరకు ఆదాయం చెల్లిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాకినాడ సీపోర్టుపై జగన్ కన్ను పడింది. దీని సంగతి తేల్చడానికి ఎంపీ మిథున్‌రెడ్డిని రంగంలోకి దించారు. ఈయన విజిలెన్స్ అధికారులతో పాటు తమకు అనుకూలమైన సంతానం అనే ఆడిట్ సంస్థను చెన్నై నుంచి రంగంలోకి దించారు. ఈ సంస్థ కొన్ని నెలల పాటు సీపోర్టులో రికార్డుల ఆడిట్ నిర్వహించి పలు లోపాలను సర్కారు పెద్ద సారుకు కావాల్సిన విధంగా గుర్తించింది. అంతర్గత ఆడిట్‌లో కేవీరావు రూ.994కోట్లు ప్రభుత్వానికి ఎగేసినట్టు లెక్కలు సృష్టించారు.ఈ నివేదికను చూపించి కేవీరావు మెడపై కత్తిపెట్టారు.అలా కేవీ రావు 41.12 శాతం వాటా బలవంతంగా లాగేసుకున్నారు.అందులో భాగంగా రూ.2,500 కోట్ల విలువైన తన వాటాకు కేవ లం రూ.494 కోట్లు ఇచ్చి లాగేసుకున్నారని కేవీరావు ఇటీవల సీఐడీకి ఫిర్యాదు చేశారు.ఈ అరాచకం వెనుక ఉన్న విక్రాంత్‌రెడ్డి,విజయసాయిరెడ్డితో పాటు మరో ముగ్గురిపై సీఐడీ కేసు నమోదు చేసింది.అటు 'ఆంధ్ర జ్యోతి' కథనాల నేపథ్యంలో వాటాల అంశంపై దర్యాప్తు చేసి అక్రమార్కులను అరెస్టు చేసేందుకు వీలుగా ప్రభుత్వం కదులుతోంది.సీఐడీకి విచారణ బాధ్యత అప్పగిం చడంతో ఇటీవల అధికారులు సీపోర్టుకు వచ్చి తనిఖీలు చేశారు. పూర్తిగా తీగలాగే ప్రయత్నం చేస్తున్నారు.



ఇటీవల పోర్టులో బియ్యం తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నాదెండ్ల, కలెక్టర్ షాన్‌మోహన్

ప్రభుత్వం మారింది..పట్టేశారు!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ బియ్యం మాఫియాపై ప్రత్యేక దృష్టిసారించింది. సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో స్వయంగా మంత్రి నాదెండ్ల కాకినాడకు వచ్చి పోర్టుతో సహా గోదాములన్నీ ఈ ఏడాది జూలైలో తనిఖీ చేశారు.రూ.157 కోట్ల విలువైన 50,647 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ల్యాబ్‌కు పంపడం ద్వారా 26,488 మెట్రిక్ టన్నులను రేషన్ బియ్యంగా గుర్తించారు.రేషన్ బియ్యం నేరుగా ప్యాకింగ్‌తో పోర్టుకు తరలిపోతుండడంతో కొత్తగా పోర్టు పరిసరాల్లో రేయింబవళ్లు పనిచేసేలా రెండు సమీకృత చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి బియ్యం లారీని తనిఖీ చేసి శాంపిళ్లు సేకరించేలా నిఘా పెట్టారు.కానీ రేషన్ మాఫియా ఒత్తిళ్లతో రాత్రివేళ తనిఖీలు నిలిచిపోయాయి.ఈ నేపథ్యంలో స్టెల్లా నౌకలో బియ్యం లోడింగ్ చేస్తుండగా అందులో 640 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ గతనెల 27న గుర్తించారు.ఆ తర్వాత 29న పవన్‌కల్యాణ్ కాకినాడ వచ్చి నౌక వద్దకు వెళ్లి రేషన్‌బియ్యం ఉన్న షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు.అప్పటి నుంచి కాకినాడలో రేషన్ బియ్యం మాఫియాపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత చర్చ జరిగింది. అదే సమ యంలో ఆంధ్రజ్యోతిలో వరుసగా పలు సంచలనాత్మక కథనాలు రావడంతో బియ్యం మాఫియాను తేల్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సిట్ త్వరలో కాకినాడలో దర్యాప్తు చేయనుంది.

కాకినాడ సీపోర్టులో మూడో చెక్‌పోస్టు

ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన కలెక్టర్ షాన్‌మోహన్

24 గంటలూ నిఘా ఉండేలా డ్యూటీలు

పీడీఎస్ బియ్యంపై పెరిగిన నిఘా

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పేదల ఆహార భద్రత కోసం నిర్దేశించిన పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్, అక్రమ ఎగుమతులు నిరోధించే చర్యల్లో భాగంగా అదనంగా మరో చెక్ పోస్టును ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు ఇప్పటికే కాకినాడ పోర్టు వద్ద రెండు చెక్‌పోస్టులు 3 షిఫ్టుల్లో 24 గంటలూ పనిచేస్తుందన్నారు. ప్రతి షిఫ్ట్‌లోను నలుగురు సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఆధ్వర్యంలో నియమించిన అధికారులు వివిధ ప్రాంతాల నుంచి పోర్టుకు వచ్చే బాయిల్డ్ బియ్యం, ముడి బియ్యాన్ని తనిఖీ చేసి వాహనాలకు గేట్ పాస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనుమానాస్పద బియ్యం గుర్తిస్తే ఆ నమూనాలను సేకరించి ల్యాబ్ విశ్లేషణ నిమిత్తం జిల్లా పౌరసరఫరాల సంస్థ ల్యాబ్‌కు పంపించడం జరుగుందన్నారు. పరీక్షలో అక్రమాలు ఏమైనా నిర్ధారణ అయితే సంబంధించిన వారిపై కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ చెక్‌పోస్టును కాకినాడ ఆర్డీవో పౌరసరఫరాల అధికారి, కాకినాడ పట్టణం, గ్రామీణ తహశీల్దార్లు, వారానికి ఒకసారి తనిఖీలు చేసి నివేదిక సమర్పించారు. ఈ చెక్‌పోస్టులో రోజుకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించే సీఎస్‌డీటీలు, డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి ఎక్కువ వాహనాలు లైన్లో నిలిచిపోకుండా చూడాలన్నారు. సీపోర్టు వద్ద లారీల రద్దీ ఎక్కువ ఉండకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి నీటి సంఘాల ఎన్నికలు

కాకినాడ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి నీటి సంఘాల ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల పరిణామాలను పర్యవేక్షించడానికి కాకినాడ కలెక్టరేట్‌లో వివేకానంద సమావేశం హాల్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. కాగా నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలకు పెద్దాపురం ఇరిగేషన్ ఈఈ జి. శేషగిరిరావు జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు.

రేపు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నారాయణ రాక


కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా సమీక్ష సమావేశం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న కాకినాడ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వస్తున్నారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, అధికారులు పాల్గొంటున్నారు.

కౌడ చైర్మన్‌గా తుమ్మల నేడు ప్రమాణస్వీకారం



కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడ) చైర్మన్‌గా జనసేన నాయకులు తుమ్మల రామస్వామి (బాబు) ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కూటమి ప్రభుత్వ నామినేటెడ్ పదవుల రెండో జాబితాలో ఆయనకు చోటు దక్కింది. పార్టీ పట్ల నిబద్ధత, విధేయత కలిగిన నేతగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. అలాగే పవన్‌కల్యాణ్‌తో సాన్నిహిత్యం ఆయనకు కలిసొచ్చింది. గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (గుడా) ఏర్పడినప్పుడు రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ నేత గన్ని కృష్ణ తొలిసారిగా చైర్మన్‌గా నియమితులయ్యారు. అనంతరం గుడా విడిపోయిన తర్వాత కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడ)గా ఏర్పడింది. దీనికి వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేటర్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రెక్టార్ కేవీ రమణ

'అన్ని రంగాల్లోనూ ఏఐ కీలకపాత్ర'

జేఎన్టీయూకే, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతిక యగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అన్ని రంగాల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్నదని జేఎన్టీయూకే రెక్టార్ ప్రొఫెసర్ కేవీ రమణ అన్నారు. యూసీఈకే సీఎస్ఈ విభాగం, ఎన్ఐఎంఎస్ఎంఈ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంలోని ఈఎస్‌డీపీ స్కీమ్ ఆఫ్ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ద్వారా సెనేట్ హాల్లో వారంరోజులపాటు జనరేటివ్ ఏఐ ఫర్ డేటా ఎనలిటిక్స్ అంశంపై నిర్వహించిన అడ్వాన్స్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్‌డవలప్‌మెంట్ ప్రోగాం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రెక్టార్ కేవీ రమణ, గౌరవ అతిథులుగా ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులు పాల్గొనగా సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎన్.రామకృష్ణయ్య వర్క్‌షాప్ కన్వీనర్‌గా వ్యవహరించారు. అనంతరం రీసోర్స్‌పర్సన్‌లకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు.



కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం వైసీపీ నేతల ధర్నా

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వడంలో వైఫల్యం

ఆరోపించిన వైసీపీ నేతలు.. జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు పెట్టుబడి సాయం చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు విమర్శించారు. శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాతకు అండగా కార్యక్రమంలో భాగంగా వైసీపీ కోఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలు కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కురసాల కన్నబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు అయినప్పటికీ పెట్టుబడి సాయం విడుదల కాకపోవడం వల్ల రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. అప్పు చేసి పంటలు పండించినా ధాన్యానికి మద్దతు ధర దక్కడం లేదన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని తరలించడానికి తగినన్ని గోనె సంచులు ఇవ్వలేదని విమర్శించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ముద్రగడ పద్మనాభరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, వంగా గీతా విశ్వనాథ్, దాడిశెట్టి రాజాలు పాల్గొన్నారు.





పెద్దాపురం ప్లీడర్స్ వీధిలో లలితా ఇండస్ట్రీస్ అధినేతల గృహాలు వద్ద ఐటీ అధికారులు... వాలుతిమ్మాపురంలో ఉన్న శ్రీ లలితా రైస్

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో ఐటీ దాడులు

• ఏకకాలంలో బృందాలుగా తనిఖీలు • మేనేజింగ్ డైరెక్టర్లు, బంధువులు, సిబ్బంది ఇళ్లలో సోదాలు

పెద్దాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఆదాయ పన్ను శాఖ (ఇన్‌కంట్యాక్స్) అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఏకకాలంలో సంస్థకు సంబంధించి పట్టణ పరిధిలో ఉన్న పలుచోట్ల ఈ సోదాలను ఐటీ అధికారులు చేపట్టారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మట్టే సత్యప్రసాద్, శ్రీనివాస్ వారి బంధువులు, సిబ్బంది ఇళ్లలో ఏకకాలంలో బృందాలుగా విడిపోయి ఈ సోదాలు నిర్వహించారు. వాలుతిమ్మాపురం, వడ్లమూరు వెళ్లే రహదారిలో ఉన్న లలితా రైస్ ఇండస్ట్రీస్ పరిశ్రమలు, వారి గృహాలు, గెస్ట్‌హౌస్‌లు, ఫామ్ హౌస్, సిబ్బంది క్వార్టర్స్‌లో కూడా ఐటీ అధికారులు తనిఖీలను చేపట్టారు. సంస్థకు సంబంధించి ఉన్న కార్యాలయాల్లో గడచిన ఐదు సంవత్సరాల రికార్డులు, రసీదులు, ఆదాయం, చెల్లింపులు వంటి వాటితోపాటు కీలక పత్రాలు, కార్యాలయంలో కంప్యూటర్లను క్షుణ్ణంగా శోధించారు. ఆదాయం, మూలధనంపై పూర్తి దర్యాప్తు చేసినట్టు తెలిసింది. తెల్లవారుజామున 5.30 నుంచి రాత్రి వరకూ సోదాలు అధికారులు చేపట్టారు. అలాగే మేనేజింగ్ డైరెక్టర్ల ఇళ్లలో ఉన్న కీలక పత్రాలు, డాక్యుమెంట్లు, నగదు, బంగారు ఆభరణాలు వాటికి సంబంధించిన వివరాలను సేకరించినట్టు తెలిసింది. పట్టణంలో ఐటీ సోదాలు జరగడంతో పలువురు పారిశ్రామికవేత్తలు కంగారుపడ్డారు. ఐటీ అధికారులు దాడులు చేయడానికి కొద్ది రోజుల ముందు నుంచే వారిపై నిఘా ఉంచినట్టు తెలుస్తోంది. ఐటీ బృందం స్థానికంగా ఓ హోటల్‌లో మకాం వేసి లక్షిత వ్యక్తుల సమస్త సమాచారాన్ని, వారి కదలికలను క్షుణ్ణంగా పరిశీలించినట్టు సమాచారం. ఏకకాలంలో ఐటీ అధికారులు ఫ్యాక్టరీ, ఇంట్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం, అక్కడ ఉన్న వ్యక్తులను బయటకు పంపకపోవడం, అలాగే రైస్ ఇండస్ట్రీస్‌లో ఉన్న సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడంతోపాటు సిబ్బందిని ఎవరినీ లోపలకు అనుమతించలేదు. ఐటీ సోదాల సమయంలో కేంద్ర బలగాలతో అధికారులు ఈ సోదాలు చేపట్టారు. స్థానికంగా ఉన్న పోలీస్ అధికారుల సహకారం ఏమాత్రం తీసుకోకుండా ఐటీ అధికారులు తమ తనిఖీలను చేపట్టారు. డాట్ టు డాట్ కనెక్షన్ విధానాన్ని అనుసరిస్తూ స్ట్రైక్ టైమ్ కంటే కొంత సమయం ముందే అధికారులు తమ సోదాలను నిర్వహించారు. దాడులకు కొద్దిగంటల ముందే కేంద్ర బలగాలు దాడులు చేపట్టే ప్రదేశానికి చేరుకున్నాయి. ఈ దాడులు మూడు రోజులపాటు జరగనున్నట్టు తెలిసింది. కీలక పత్రాలు, ఫైళ్లు ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.



పచ్చని మణిహారం.. కడియం!



లక్షా 30వేల విలువచేసే రావిచెట్టు

సుమారు ఐదు వేల ఎకరాల్లో 1,600 పైగా నర్సరీలు

15 వేల రకాల పండ్ల, పూల మొక్కలు.. వేలాది మందికి ఉపాధి

ఎటు చూసినా పచ్చని తివాచీలా పరుచుకున్న పసిడికాంతుల అందాలు.. ఏ వైపు చూసినా చిరుగాలులు వీచే మొక్కలు.. మరోవైపు అందాలు విరబూస్తూ ముద్దులొలికే పూల రమణీయతల కలబోత కడియం. దేశంలో ఏ ప్రాంతంలో ఉన్న చెట్టైనా, నీడనిచ్చే ప్లాంటైనా, చిన్నారులు ఆడుకునే, పెద్దలు సేదతీరే పార్కుల్లో ఉన్న హోయలొలికే, విరబూసే మొక్కలు అయినా టక్కున గుర్తుకువచ్చేది కడియం నర్సరీలే. ఎందుకంటే ఏటా 90 శాతం ఎగుమతులు ఇక్కడి నుంచే ఉంటాయి.



(ఆంధ్రజ్యోతి- కడియం)

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం అంటే తెలియని వారుండరు. ఇక్కడ కడియపులంకలో నర్సరీలు తొలుత మొదలై, తర్వాత కడియం, వీరవరం, దామిరెడ్డిపల్లి, మురమండ, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, కడియపుసావరం, పొట్టిలంక, వేమగిరి గ్రామాలతోపాటు రాజానగరం, గండేపల్లి, ఆలమూరు, మండపేట మండలాల్లోని కొన్ని గ్రామాల్లో నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఒక్క కడియం మండలంలోనే 5 వేల ఎకరాల్లో సుమారు 1,600 పైగా నర్సరీలు విస్తరించి ఉన్నాయి.

జూన్ నుంచి క్రయవిక్రయాలు

ప్రతి ఏడాది తొలకరి చినుకులు పడగానే మొక్కల సీజన్ ప్రారంభమవుతుంది. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిసా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, పాండిచ్చేరి, న్యూఢిల్లీ, బోపాల్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఈ ప్రాంతం నుంచి అక్టోబరు నెల వరకు రోజుకు సుమారు 50 నుంచి 100 లారీలు, మిగతా నెలల్లో రోజుకు సుమారు 20 లారీల మొక్కలు ఎగుమతి అవుతుంటాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రం మొక్కలు అమ్మకాలు పెద్దగా ఉండవు.

● రూ. 10 మొక్క నుంచి...

కడియం ప్రాంత నర్సరీలో రూ.10 కరివేపాకు మొక్క నుంచి రూ.వెయ్యి వరకు రకరకాల మొక్కలు లభ్యమవుతాయి. అలాగే రూ.2 వేల నుంచి రూ.15 వేల విలువచేసే మొక్కలతోపాటు మల్టీ ఫైకస్ (లక్షల రూపాయల విలువ చేసే మొక్కలు) కూడా లభిస్తాయి. ఇండోర్, ఔట్‌డోర్, పామ్స్, ఎవెన్యూ, ఆర్నమెంటల్, సెమిషేడ్, ఆక్వాటిక్ ప్లాంట్స్, కాక్టస్ ఫ్యామిలీ, జేడ్ ఫ్యామిలీ, ట్రోపరీస్, హెడ్డింగ్ ప్లాంట్స్ ఇలా వివిధ రకాలకు చెందిన మొక్కలు వాటిలో రకాలు, వాటిలో రంగులు ఇలా సుమారు 15 వేల రకాలు కడియం నర్సరీల్లోనే లభిస్తాయి. లిల్లీ, మందార, మల్లె, చామంతి, విరజాజి వంటి పూల రకాలు, మామిడి, సపోటా, బత్తాయి, నారింజ, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, వంటి పండ్ల రకాలు, ఆగ్లోనిమా, స్పైడర్ లిల్లీ, ట్రావెలర్ పామ్స్ రాయల్‌పామ్, పాక్స్‌టైల్ పామ్, టెర్మినేలియా గ్రీన్, వైట్, బోగన్‌విలియా వైట్, రెడ్, మల్టి కలర్ వంటి రకాల మొక్కలు ఈ ప్రాంతంలోనే లభ్యమవుతాయి.



● నర్సరీ రంగమే ఆధారం..

నర్సరీ రంగాన్ని ఆధారం చేసుకుని మొక్కల రవాణా చేసే లారీల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, నర్సరీలో మొక్కల ఎగుమతి చేసే కార్మికులు, మొక్కల ప్యాకింగ్, నర్సరీల్లో కలుపుతీత, నీరు పెట్టడం వంటి పనులు చేసే మహిళా కూలీలు ఇలా అనేకమంది ఉపాధి పొందుతున్నారు.



పుష్పాలదరహో..

పూల కడియంలో పురివిప్పి నాట్యంచేస్తున్న సీజనల్ పుష్పాలు

కడియం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శీతగాలి తగలగానే రంగురంగుల పూలు, అందమైన హోయలు ఒలకబోస్తూ కనువిందు చేసే సుందర దృశ్యాలకు నెలవుగా మారింది పూల కడియం. శీతాకాలం రాగానే ఇక్కడుండే ప్రతీ మొక్క పూలతో పలకరించి పులకరిస్తోంది. వందలాది రకాల పూల మొక్కలు వివిధ రంగుల్లో విరబూస్తూ కాంతులీనుతాయి. సరికొత్త రకాల పూల సుగంధ పరిమళాలు వెదజల్లుతూ పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తాయి. మంచుబిందువు పడగానే ఆకులే పుష్పాలుగా మారే పాయించిటియాలు, అరచేతి పరిమాణంలో విచ్చుకుని ఔరా అనిపించే గ్లాడియేటర్‌లు, పాము పడగలా గాలికి స్వైర విహారం చేసే స్వాతోఫైలం, ఆంధోరియం పూల మొక్కలు మేరీగోల్డ్ బంతిపూలు, మినీ ఆస్టర్స్, బిగోనియాలు, వింకారోజియా, సాల్వియా, దయంతస్, డాలియాలు, లింక్‌రోజ్, జనీయా, ఆర్కిడ్స్ వంటి కోకొల్లలు మొక్కలు అందంగా విచ్చుకుని చూపరులను ఆకట్టుకుంటాయి. శీతాకాలం రాగానే కడియం పరిసర ప్రాంతాల్లో ఎటుచూసినా చక్కగా విచ్చుకున్న పూలమొక్కలు, గుంపులు గుంపులుగా అందంగా దర్శనమిస్తాయి. మనం ఒకటి, రెండు రకాల మొక్కలు చూస్తేనే అబ్బుర పడిపోతాం. అలాంటిది వందలాది రకాల మొక్కలు లక్షల సంఖ్యలో కొలువుతీరి కబుర్లాడుకుంటుంటే చూడ తరమా. అందుకే ధనుర్మాసం వచ్చిందంటే కడియం నర్సరీలన్నీ పర్యాటకులు, వనప్రియుల రాకతో కళకళలాడుతుంటుంది. దానికితోడు ఈ సీజనల్ పుష్పాల రాక కాలంలోనే క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వంటి పండుగలు రావడంతో కడియం నర్సరీలు పర్యాటకులతో కళకళలాడుతుంటాయి.



నర్సరీ రైతులు అక్టోబరు మాసం నుంచే ఈ సీజనల్ పుష్పాల మొక్కల తయారీలో నిమగ్నమవుతారు. మొక్కల తయారీతోపాటు వీటిని ఒకే క్రమంలో ఉంచి చూడముచ్చటగా తీర్చిదిద్దుతారు. ఇలా ఈ కాలంలో సీజనల్ పుష్పాలదే ప్రత్యేక స్థానంగా చెప్పవచ్చు.

రైల్వే కోర్టు పునఃప్రారంభం

- ● తొలి రోజు.. 666 కేసుల్లో తీర్పు
- ● తీరిన ఆరేళ్ల అవస్థలు
- ● నెలకోసారి ఇక్కడే విచారణ



కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న మేజిస్ట్రేటు ఆర్‌వీ శర్మ

రాజమహేంద్రవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైల్వే కేసుల్లో పోలీసులకు ఆరేళ్ల అవస్థలు గట్టెక్కాయి. రైల్వే క్యాంపు కోర్టును శుక్రవారం ఏడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్(రైల్వేకోర్టు) ఆర్‌వీ శర్మ పునఃప్రారంభించారు. రైల్వే నేరాలకు సంబంధించి రైల్వే రక్షకదళం(ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) కేసులు బనాయిస్తుంటారు. వీటిని రైల్వేకోర్టులో విచారిస్తారు. రాజమహేంద్ర వరంలో రైల్వే క్యాంపు కోర్టు నిర్వహించి కేసులను విచారించడం జరిగేది. కానీ ఆరేళ్ల కిందట ఈ కోర్టును మూసేశారు. తర్వాత కరోనా విపత్తు రావడంతో కోర్టు నిర్వహణను పక్కన పెట్టేశారు. అప్పటి నుంచి ఇక్కడ నమోదు చేసిన కేసుల విచారణ విజయవాడ రైల్వేకోర్టులో చేపడుతున్నారు. దీంతో కేసుల విచారణలో జాప్యం చోటుచేసుకోగా.. కేసులసంఖ్య పేరుకుపోతూ ఉండేది. దీంతో రాజమహేంద్రవరంలోని రైల్వే క్యాంపు కోర్టును శుక్రవారం పునరుద్ధరించారు. సీనియర్ పీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కోర్టు ఆవరణలో మొక్కను నాటారు. తొలి రోజున నోపార్కింగ్, దివ్యాంగులకు, మహిళలకు ఉద్దేశించిన బోగీల్లో ఇతరులు ప్రయాణించడం, రైళ్లలో పొగతాగడం తదితర రైల్వే చట్టాలకు సంబంధించిన 666 కేసుల్లో తీర్పునిచ్చారు. నేరస్తులకు రూ.2.60లక్షల జరిమానాలు విధించారు. ప్రస్తుతం ఈ క్యాంపు కోర్టును నెలకోసారి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఎంఎస్ చౌహాన్, రైల్వే సీనియర్ పీపీ టి.మురళి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.సైదయ్య, జీఆర్పీ ఇన్ స్పెక్టర్ పి.శ్రీనివాస్, సీటీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.

భగవంతుడిని పూజించడమంటే.. సేవ చేయడమే!

ఆత్మీయ సమావేశంలో చిన జీయర్‌స్వామి

రాజమహేంద్రవరంకల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భగవంతుడిని పూజించడమంటే.. ఈ విశ్వంలో ఉన్న అన్ని జీవులు, ప్రకృతికి సేవ చేయడమేనని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. గౌతమి ఘాట్‌వద్ద రంగధామం క్షేత్రం వికాస తరంగిణి ఆత్మీయ సమావేశంలో ఆయన అనుగ్రహ భాషణం చేశారు. మానవ కుటుంబ జీవనానికి మూలం మహిళలు.. దేశ భవిష్యత్‌కు ఆయువు పట్టు పిల్లలు.. దేశానికి కవచం యువత అన్నారు. ప్రజ్ఞ వికాస్,ఆరోగ్య వికాస్, యువ వికాస్, సంస్కార వికాస్ అను విభాగాల్లో సేవలందించాలన్నారు. ఆవులు,భూమికి, మానవ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయన్నారు. పండ్లు,పూలు కాచే మొక్కలను నాటి ఆరోగ్య సమాజాన్ని నిర్మాణం చేయాలని దిశా నిర్దేశం చేశారు. అహోబిల రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోనే చిన్న జీయర్‌స్వామి వికాస తరంగిణి ప్రారంభించా రన్నారు. రాజమహేంద్రవరాన్ని కేంద్రంగా చేసుకుని తూర్పుగోదావరి జిల్లాలో జీయర్ స్వా మి అనుయాయులుగా చక్కని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ యువ వికాస్ సమన్వయకర్త అలి కాని సత్య శివకుమార్ మాట్లాడుతూ 2025-26సంవత్సరానికిగాను సేవా రుచి కలిగిన ప్రతిఒక్కరూ 85200 34741, 9989032311 ఫోన్ నెంబర్లలో సంప్రదించి దరఖాస్తు పొందవచ్చన్నారు. వికాస తరంగిణిలో సేవ చేసేందుకు 10 గ్రామాల నుంచి విచ్చేసిన సభ్యులను అభినందించారు.



శ్రీరంగధామం క్షేత్రంలో మాట్లాడుతున్న చిన జీయర్ స్వామి



ఎన్నేళ్లు పడుతుందో?



- నత్తనడకన పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ
- ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మాన్యువల్‌గానే దస్త్రాల నిర్వహణ
- అక్రమాల అడ్డుకట్టకు డిజిటలైజేషన్ చేయాలని కేంద్రం నిర్ణయం
- ఆన్‌లైన్ పూర్తయితే ఎన్నో సమస్యలకు పరిష్కారం
- సహకార శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో జాప్యం

కాకినాడరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రాథ మిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)లో డాక్యుమెంట్ల కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతోంది.ఈ ప్రక్రియ ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా పూర్తికాలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే జాప్యానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అక్రమాలు బయటపడతాయనేనా?

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 298 పీఏసీఎస్‌లుండగా, వాటిలో 2.50లక్షల మంది సభ్యులున్నారు. వాటన్నింటినీ కంప్యూటరీకరణ చేయాలని దానికి సంబంధించిన ప్రక్రియను ఆగస్టులోనే ప్రారంభించారు. ఇప్పటికీ 15 పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ నేటికీ పూర్తికాని పరిస్థితి. కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతోంది. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయితే తమఅక్రమాలు బయటపడతాయనే భయంతోనే కొన్నిచోట్ల పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణను ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

గతేడాదే మొదలు..

మొదటిగా ఈప్రక్రియను గతేడాది జూన్ 30లోపు, రెండోసారి ఈఏడాది అక్టోబరు 2లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించగా అప్పటికీ పూర్తి కాకపోవడంతో ఆ నెలాఖరు నాటికి కంప్యూటరీకరణను పూర్తిచేయాలని ఆదేశించారు. అయినా పూర్తికాలేదు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలన్నింటిలోనూ మాన్యువల్‌గానే దస్త్రాలు నిర్వహిస్తున్నారు. వాటిలో రుణాల మంజూరు నుంచి రికవరీ వరకూ అన్నీ సర్దుబాట్లతోనే సరిపెడుతున్నారు. ఈ క్రమంలో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకే లావాదేవీలను డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

పూర్తయితే రైతులకు మేలు

రుణాలు తీసుకున్న రైతులు చెల్లించిన వాయిదాలు, వడ్డీకి సంబంధించిన వివరాలు కావాలంటే రికార్డులన్నీ తిరగేయాల్సి వస్తోంది. ముఖ్యంగా భూముల వివరాలు, ఆధార్‌తో అనుసంధానం చేయడంతో సబ్సిడీ నేరుగా ఖాతాలోకి జమ అవుతుంది. దస్త్రాల్లో మాదిరిగా కొట్టివేతలకు అవకాశం లేకపోవడంతో సిబ్బంది అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అది నీరుగారిపోయింది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం డిజిటలైజేషన్ ద్వారా రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టింది.

రూ.100కోట్ల వరకూ లోన్ల రికవరీ కాలేదు

కాకినాడ జిల్లాలో 72 పీఏసీఎస్‌లుండగా వాటిలో 80,484 మంది సభ్యులున్నారు వాటిలోని 9 పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ ఇప్పటివరకూ జరగలేదు. జిల్లాలోని గండేపల్లి, లంపకలోవ, జగ్గంపేట, కిర్లంపూడి తదితర పీఏసీఎస్‌ల్లో జరిగిన అవకతవకల కారణంగా రూ.100కోట్ల వరకూ లోన్ల రికవరీ కాకపోవడం కంప్యూటరీకరణ జరిగితే వారు చేసిన అక్రమాలు, లోపాలు బయటకు వస్తాయని కావాలనే పైన పేర్కొన్న పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణను ముందుకు సాగనీయడం లేదని సమాచారం. ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సంబంధించి ఏదైనా కార్యక్రమం చేద్దామంటే కంప్యూటరీకరణ పూర్తి కాకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

సాంకేతిక కారణాలవల్ల ఆలస్యం

పీఏసీఎస్‌ల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని సాంకేతిక కారణాలవల్ల ఈ ప్రక్రియ కొన్ని సంఘాల్లో ఆలస్యమవుతోంది. త్వరలో పూర్తవుతుంది.

-జి.వెంకటకృష్ణ, డీసీవో, కాకినాడ

గోదారిలో ఇసుక తోడేళ్లు

- ● బ్రిడ్జిల చెంత ఇసుక తవ్వుతున్న రెండు బోట్లు సీజ్
- ● ఇసుక ఓవర్‌లోడ్‌తో 5 లారీలకు అపరాధ రుసుం

కొవ్వూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా గోదావరి వంతెనల మధ్యలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న 2 బోట్లను టాస్క్‌ఫోర్సు అధికారులు సీజ్‌చేసి కేసు నమోదుచేశారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి, హేవలాక్ బ్రిడ్జి (పాత రైలువంతెన)లవద్ద శుక్రవారం టాస్క్‌ఫోర్సు ఎస్‌ఐ జి.పరమేష్, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బ్రిడ్జిల మధ్య 300మీటర్ల దూరంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్న రెండు బోట్లను సీజ్ చేశారు. ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు ఫిర్యాదు మేరకు బోటు యజమానులపై పట్టణ ఎస్‌ఐ జగన్మోహనరావు కేసు నమోదు చేశారు. ఇటీవల రాజమహేంద్ర వరం, కొవ్వూరు వైపు 20బోట్లను సీజ్‌చేసి బోటు యజమానులపై కేసు నమోదు చేశారు. ఇక నుంచి అలా చేస్తే కఠినచర్యలు ఉంటాయని జేసీ హెచ్చరించినా బోటు యజమానుల్లో మాత్రం మార్పురాలేదు. బ్రిడ్జిల మధ్య యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా బ్రిడ్జిల వద్ద ఇసుక తవ్వకాలు జరుపుతున్న బోట్లను సీజ్‌చేసిన టాస్క్‌ఫోర్సు అధికారులు

5 లారీలకు రూ.72,374 ఫైన్

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఓవర్ లోడ్ వేసుకుని ఇసుక రవాణా చేస్తున్న 5 లారీలకు టాస్క్‌ఫోర్సు బృందం రూ.72,374లు అపరాధ రుసుములు విధించారు. కొవ్వూరు పట్టణం వాడపల్లి రోడ్‌లో ఎరినమ్మ ఇసుక ర్యాంపు వద్ద శుక్రవారం కొవ్వూరు సబ్ డివిజన్ శాండ్ టాస్క్‌ఫోర్సు బృందం కొవ్వూరు ఎంవీఐ కె. శివప్రసాద్, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ, టాస్క్‌ఫోర్సు ఏఎస్‌ఐ జి.శ్రీనివాస్ ఇసుక లారీలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అదనపు లోడ్ చేసుకున్న 5 లారీలను గుర్తించి అపరాధ రుసుములు విధించినట్లు టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు.



ఓవర్‌లోడ్ ఇసుక లారీని పట్టుకున్న మైనింగ్ టీఏ శైలజ, ఏఎస్‌ఐ శ్రీనివాస్

జైలులో పరిచయాలు.. దొంగతనాలకు వ్యూహరచనలు!

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

రూ.24.65 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం

కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు వెల్లడి

పోలీసు అధికారులకు రివార్డులు





దొంగల ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు ఆభరణాలను చూపిస్తున్న కోనసీమ జిల్లా ఎస్పీ, రివార్డు అందజేస్తున్న దృశ్యాలు

అమలాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు లోనై చిన్నతనం నుంచి చిన్న చిన్న చోరీలతో ప్రస్థానం ప్రారంభించిన దొంగలు అంతర్ జిల్లా స్థాయిలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో నేరాలకు పాల్పడిన ముగ్గురు సభ్యుల దొంగల ముఠాను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీబి.కృష్ణారావు శుక్రవారం సాయంత్రం అమలాపురంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం 13 కేసులకు సంబంధించి రూ.24.65 లక్షల విలువైన 311 గ్రాముల బంగారం, 3.200 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అమలాపురం రూరల్ మండలం చిందాడగరువుకు చెందిన మండేల నాగభాస్కరావు అలియాస్ బాబి, ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందినబొడ్డు కిశోర్, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన ముత్యాల పెద్దిరాజు అలియాస్ వీఆర్వో రాజులు ముఠాగా ఏర్పడ్డారు. వారు కోనసీమ జిల్లా పరిధిలో 11 పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డారు. పశ్చిమ గోదావరిలో ఒకటి, కాకినాడ జిల్లాలో ఒక కేసు వెరసి 13 కేసుల్లో వారిని అరెస్టు చేశారు. ముఖ్యంగా ఆత్రేయపురం పోలీసుస్టేషన్ పరిధిలో 2 కేసులు, ఆలమూరు స్టేషన్ పరిధిలో 2, అంగరలో 1, అంబాజీపేట 1, అమలాపురం టౌన్ 1, సఖినేటిపల్లి, 1, కొత్తపేట 1, పి.గన్నవరం 1, కాకినాడ జిల్లా పరిధిలోని గొల్లప్రోలు పోలీసుస్టేషన్ పరిధిలో 1, పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట పోలీసుస్టేషన్ పరిధిలో ఒక కేసుల్లో వారిని అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒకడైన మండేల నాగభాస్కరరావు చిన్నతనం నుంచి వ్యసనాలకు లోనై దొంగతనాలకు పాల్పడడం ద్వారా అంతర్ జిల్లాల స్థాయిలో దొంగతనాలకు పాల్పడుతున్నట్టు ఎస్పీ తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రంలోఅతడిపై 40కు పైగా దొంగతనం కేసులు ఉన్నట్టు చెప్పారు. కేసులో మరో నిందితుడైన ముత్యాలపల్లి పెద్దిరాజు దొంగనోట్ల చెలామణి విషయంలో నర్సాపురం పోలీసుస్టేషన్‌లో అరెస్టు అయి 23 రోజులు జైలులో ఉండి బెయిల్‌పై వచ్చినట్టు తెలిపారు. బొడ్డు కిశోర్ అనే నిందితుడు అనతవరంలో అనిత అనే అమ్మాయిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు. వారి ముగ్గురు జైలులో పరిచయమై వరుస దొంగతనాలకు వ్యూహరచనలు చేసుకున్నట్టు చెప్పారు. ఈ చోరీ కేసులను చేధించడంలో విశేషంగా కృషి చేసిన ఎస్డీపీవో వై.గోవిందరావు, రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ రాము, క్రైమ్‌పార్టీ ఇన్‌చార్జి సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది విశేష కృషి చేసి నిందితులను లొల్ల లాకుల వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందికి ఎస్పీ రివార్డులను అందజేశారు. సమావేశంలో కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ రాము ఉన్నారు.

దొంగనోట్ల ముఠా అరెస్ట్

పోలీసులు అదుపులో 12 మంది సభ్యులు

రూ.లక్షా 33వేల విలువైన నోట్లు, ముద్రణ పరికరాలు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

వివరాలు వెల్లడించిన కోనసీమ జిల్లా ఎస్పీ



దొంగనోట్ల ముఠా వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు



స్వాధీనం చేసుకున్న దొంగనోట్ల ముద్రణా పరికాలు

అమలాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా దొంగనోట్లు భారీగా ముద్రిస్తూ చెలామణి చేస్తున్న పన్నెండు మంది సభ్యుల దొంగ నోట్ల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం సాయంత్రం అమలాపురంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. దొంగల నోట్ల ముఠా నుంచి రూ.లక్షా 33వేల విలువైన దొంగనోట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు దొంగ నోట్ల తయారీకి ఉపయోగించే సాంకేతిక పరికరాలు, యంత్ర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు కేంద్రంగా దొంగనోట్ల ముఠా నకిలీ నోట్లను చెలామణి చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తాటిపాక మఠం ప్రాంతానికి చెందిన కోళ్ల వీరవెంకట సత్యనారాయణ అనే పాస్టర్ యాక్సిస్ బ్యాంకు డిపాజిట్ నోట్‌లో రూ.500 నోట్లు 100 అంటే రూ.50వేలను డిపాజిట్ చేశారు. అయితే ఆ డిపాజిట్ సొమ్ము అంతా దొంగ నోట్లగా గుర్తించిన యాక్సిస్ బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 30వ తేదీన నమోదైన కేసుపై రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ బి.రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా పాస్టర్ కోళ్ల సత్యనారాయణను విచారించగా దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు అవడంతో ఈ మొత్తం ముఠా నెట్‌వర్క్‌ను చేధించారు. నకిలీ కరెన్సీ రాకెట్‌ను నడిపించడంలో విభిన్న పాత్రలు పోషించిన 12 మందిని ఈ కేసులో అరెస్టు చేశారు. నకిలీ కరెన్సీ నోట్ల మూలాన్ని షేక్ మస్తాన్ నిర్వహిస్తున్న హనుమాన్ జంక్షన్ మండలం వీరవల్లి గ్రామంలోని ఎస్ఎంఎస్ ఇంటర్‌ప్రైజెస్ ద్వారా గుర్తించారు. నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించడం, ఏజెంట్ల ద్వారా చెలామణి చేయడంలో వీరిపాత్ర కీలకంగా ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. ఈ 12 మందితో పాటు మరికొంత మంది ప్రమేయం ఉన్నట్టు తేలిందని వారిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. పాస్టర్ సత్యనారాయణ అనపర్తికి చెందిన సత్తి వీరరాఘవరెడ్డితో ఏర్పరుచుకున్న పరిచయం ద్వారా నకిలీ నోట్లు చెలామణి జరుగుతున్నట్టు తెలిపారు. రాఘవరెడ్డి ఏజెంట్లుగా మారాయ్య, గోపీలను షేక్ మస్తాన్ నిర్వహిస్తున్న ఎస్ఎంఎస్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా నోట్లను పొందారు.

అరెస్టయిన వారు...

ఈ కేసులో కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకకు చెందిన కోళ్ల వీరవెంకటసత్యనారాయణ (58), ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన పాశర్లపూడి వెంకటసత్యనారాయణ అలియాస్ సతీష్ (42), రాయవరం మండలం వెంటూరుకు చెందిన పట్టపగలు మారయ్య (36), రామచంద్రపురం పట్టణానికి చెందిన ఉత్తరాల హరిఅప్పారావు (40),మాగంటి గోపి (33), కపిలేశ్వరపురం మండలం శ్రీరామపురానికి చెందిన బొక్కా శ్రీనివాస్ (40), తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన సత్తి వీరరాఘవ అలియాస్‌రెడ్డి (67), కడియం మండలం వేమగిరికి చెందిన తుంపర దుర్గాప్రసాద్ (30), హనుమాన్ జంక్షన్ సమీపంలోని గన్నవరం మండలానికి చెందిన షేక్ మస్తాన్ అలియాస్ వర్మ (42), కృష్ణా జిల్లా వీరవల్లికి చెందిన షేక్ హనీప్ (33), కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం బొడ్డువెంకటాయపాలేనికి చెందిన కామేశ్వరరావు (40), పెదపూడికి చెందిన సుబ్బయ్య (42)ను అరెస్టు చేశారు.

అధికారులకు అభినందన

కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, జిల్లా క్రైమ్ టీమ్ ఇన్‌చార్జి ప్రశాంత్‌కుమార్‌లతో పాటు సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించి వారికి రివార్డులు అందజేశారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక



శ్రావణి

పిఠాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం విద్యార్థిని ఎంపికైంది. పట్టణానికి చెందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి కేఎస్‌వీఎస్ శ్రావణి విజయవాడలోని మేరీ స్టెల్లా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. యూనివర్సిటీ పరిధిలో జరిగిన పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా కేరళలో ఈనెల 18 నుంచి 24వ తేది వరకూ జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేశారు. ఆమె గతంలో పిఠాపురంలో ఉండగా ఐదుసార్లు జాతీయ బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైంది. ఆమెను పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, జిల్లా సభ్యులు కొత్తెం సుందర కుమార్, సంబూరు అర్జున, గరికపాటి దుర్గాప్రసాద్, బొజ్జా సతీష్ అభినందించారు.

తాటిపర్తిలో ముగిసిన షష్ఠి మహోత్సవాలు

గొల్లప్రోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 87వ షష్ఠి మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్వామికి సుబ్రహ్మణ్య షట్‌సహస్ర నామార్చన నిర్వహించారు. రాత్రి శ్రీపుష్పయోగం జరిగింది. ఊయలలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి భక్తులు ఊయలసేవ జరిపారు. వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు పూజాది కార్యక్రమాలు జరిపించగా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి శ్రీపుష్పయోగం దృశ్యం

సామర్లకోటలో డిప్యూటీ స్పీకర్ సతీమణి పూజలు

సామర్లకోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమద్ వ్రత పర్వదినం పురస్కరించుకుని కాకినాడ జిల్లా సామర్లకోట కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం శుక్రవారం సామూహిక వ్రత పూజలు నిర్వహించారు. రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు సతీమణి రమాదేవి ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం ఎదుట శుక్రవారం హనుమద్ వ్రత పూజలను నిర్వహించారు. రమాదేవికి కంచిమహాసంస్థానం వ్యవస్థాపక కుటుంబీకులు పతం జలి ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వచనంతోపాటు ప్రసాదాలు అందజేశారు.



పూజల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ సతీమణి

దుర్గాడలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

4.40 మెట్రిక్ టన్నుల ఎరువులు, 9.25 లీటర్ల పురుగుమందుల స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని వెంకటేశ్వర ఏజెన్సీస్‌లో 4రోజులుగా జరిగిన విక్రయాలు, రికార్డులు, నిల్వలకు పొంతన లేకపోవడంతో షాపులో ఉన్న రూ.1.41లక్షలు విలువైన 4.40 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకుని 6(ఏ) కేసు నమోదు చేశారు. అదే విధంగా గంగా ట్రేడర్స్‌లో 9.25లీటర్ల వివిధ పురుగుమందులను సీజ్ చేశారు. విజిలెన్స్ ఎస్పీ స్నేహిత ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో సీఐ టి.నాగ వెంకటరాజు, ఏజీ లక్ష్మీనారాయణ, ఏఈ సుబ్రహ్మణ్యం, పీసీ వీరబాబు, తూనికలు కొలతలు శాఖ ఇనస్పెక్టర్ పి.సరోజిని, మండల వ్యవసాయాధికారి కేవీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.



దుర్గాడలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రతిభావంతులకు 'నన్నయ' చక్కని వేదిక

● రిజిస్ట్రార్ సుధాకర్ ● అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం చక్కని వేదిక అవుతుందని రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయం విద్యకళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ క్రీడాకారుల వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల నుంచి హాజరైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ధృడమైన విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అథ్లెటిక్స్‌లోని రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి 24 ఈవెంట్స్‌లో పురుషులకు, మహిళలకు పోటీలు జరుగుతాయని తెలిపారు. అనంతరం హాఫ్ మారథాన్(21 కిలోమీటర్లు) మహిళ పరుగు పందెంలో మొదటి మూడుస్థానాలు సాధించిన జి.పావని(ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం) ఎస్.సౌమ్యశిరీష(ఏఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాకినాడ), బి.నాగలక్ష్మిదుర్గ(ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం)లకు పతకాలు అందజేసి అభినందించారు. పురుషుల విభాగంలో మొదటి మూడు స్థానాలు సాధించిన బి.సురేష్ (ఎస్‌సీఐఎండీసీ, తణుకు)ఎ. మోహనకృష్ణ ప్రసాద్ (డీఎన్ఆర్ కళాశాల, భీమవరం) పి.సాయిరామ్(డిగ్రీ కళాశాల, భీమడోలు)కు పతకాలను అందజేసి అభినందించారు. అలాగే డిస్కస్ త్రో మహిళా విభాగంలో సీహెచ్ శోభారాణి (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం), ఎస్.శ్రీలక్ష్మీలావణ్య(నన్నయ విశ్వవిద్యాలయం) కె.శ్రీదేవి (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం) తొలి మూడు స్థానాల్లో నిలిచి పతకాలను అందుకున్నారు. తరువాత ఐదు వేల మీటర్లు వాకింగ్ రేస్‌లో మహిళా విభాగంలో ప్రతిభ కనబరచిన వి.నాగలక్ష్మి, సీహెచ్.ఝాన్సీదుర్గ, ఎస్.పుష్పలతలకు పతకాలు ప్రదానం చేశారు. ఇరవై వేల మీటర్లు వాకింగ్ రేస్ పురుషుల విభాగంలో ప్రతిభ కనబరచిన బి.జీవన్‌కుమార్, యు.భీమయ్య, ఎన్.హేమసాయిలకు పతకాలు అందజేసి అభినందించారు. మిగిలిన క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు పి.సురేష్‌వర్మ, ఎన్.ఉదయభాస్కర్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, కార్యనిర్వాహక చైర్మన్ కె.సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చొల్లంగి వెంకట సుబ్రహ్మణ్యం, పరిశీలకులు సాల్మన్ దేవానంద్, వ్యాయామవిద్య అధ్యాపకులు బాలసత్యనారాయణ, బి.రామ్‌గోపాల్, ఫణీంద్ర, మూర్తి, డీఎస్ఆర్ కళాశాల పీడీ రాజు ఉన్నారు.



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న మహిళా క్రీడాకారులు

లభించని పెద్ద పులి ఆచూకీ



వేళంగి రిజర్వ్ ఫారెస్ట్‌లో గాలిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో 6రోజుల కిందట లేగదూడను చంపి కలకలం సృష్టించిన పెద్ద పులి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. లేగదూడను చంపి కొద్ది మాంసం తిని వెళ్లిన పెద్ద పులి మళ్లీ తిరిగి వస్తుందని ఆ ప్రదేశంలో అటవీశాఖాధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాకు చిక్కలేదు. పులి ఎక్కడ ఉంది? ఎటువైపు వెళ్లింది? అనే సందేహాలపై అటు అటవీశాఖాధికారులు, ఇటు సబ్ ప్లాన్ ఏజెన్సీ గిరిజనుల్లో చర్చనీయాంశంగా మారాయి. శుక్రవారం కూడా జిల్లా అటవీశాఖాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలేశ్వరం రేంజర్ కె.దుర్గారాంప్రసాద్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి పులి సంచరించే అవకాశం ఉన్నప్రదేశాల్లో శిబిరాలు ఏర్పాటు చేసుకుని గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. వేళంగి, తాడువాయి, దోపర్తి రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దు గ్రామాల్లో అటవీ సిబ్బంది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి కదలికలు కనిపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు.

కొనసాగుతున్న గాలింపు

అధికారుల అత్యవసర సమావేశం

నియోజకవర్గంలోని రిజర్వ్‌ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో ఏర్పాటు చేసే విద్యుత్ కంచెల వల్ల పెద్ద పులి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ముందు జాగ్రత్తగా అటవీ, విద్యుత్, పోలీస్ శాఖాధికారులు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమయ్యారు. తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అలాగే ఉలిగోగుల రిజర్వ్ ఫారెస్ట్‌లో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలను తొలగించారు. బురదకోట అటవీప్రాంతంలో తిష్టవేసినట్టుగా భావిస్తున్న పెద్ద పులి సంరక్షణ అధికార యంత్రాంగానికి విద్యుత్ కంచెల ఉచ్చులతో సవాల్‌గా మారింది.

భార్యపై అనుమానం.. వ్యక్తిపై దాడి

ముగ్గురి అరెస్ట్

కిర్లంపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం రావడంతో భర్త ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటనపై శుక్రవారం కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఎస్ఐ సతీష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన సతీష్ తన భార్య మీద అనుమానం పెంచుకున్నాడు. ఆ గ్రామానికి చెందిన రమణపై కూడా అనుమానం పెంచుకుని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం సతీష్ అన్నయ్య రాజు, బావమరిది శివతో కలిసి మోటార్ బాగు చేయాలని రమణను బూరుగుపూడి అయ్యప్పస్వామి గుడి దాటిన తర్వాత పుంత రోడ్డులోకి తీసుకుని వెళ్లి దాడి చేశారు. రమణ తప్పించుకుని పారిపోయాడు. దీంతో రమణ మోటారుసైకిల్‌ను ఆ ముగ్గురు కలిసి పెట్రోల్ పోసి తగలబెట్టేశారు. దీనిపై ఫిర్యాదు రావడంతో ఎస్ఐ సతీష్ నిందితులను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు తరలించారు.



బూరుగుపూడి వద్ద పుంతరోడ్డులో తగలబెట్టిన బైక్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ

వివాహితను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

కిర్లంపూడి మండలం కృష్ణవరానికి చెందిన ఓ వివాహితను తన కోరిక తీర్చమని వేధిస్తున్న అదే గ్రామానికి చెందిన రమణను ఎస్ఐ సతీష్ బాబు శుక్రవారం అరెస్టుచేసి కేసు నమోదు చేశారు. అతడిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా 15రోజులరిమాండ్ విధించినట్టు తెలిపారు.

అధిక లాభాలు ఆశ చూపి టోకరా

భార్యభర్తలపై కేసు నమోదు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అధిక లాభాలు వస్తాయని ఎంఎన్‌కె కంపెనీలో పొదుపు చేయాలని భార్యభర్తలు పలువురిని నమ్మించి మోసగించిన వైనంపై రామచంద్రపురం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ముచ్చిమిల్లి రోడ్డులో సాయిబాబా గుడి వద్ద నివాసం ఉంటున్న స్వామికన్ను శశికుమార్‌తో అదే ప్రాంతంలో ఉండే మత్తాల నవీన్‌కుమార్, మత్తాల సాయి పల్లవి పరిచయం పెంచుకున్నారు. ఎంఎన్‌కె ట్రేడింగ్ అడ్వయిజరీ కంపెనీలో పెట్టుబడి పెడితో అధిక లాభాలు వస్తాయని శశికుమార్‌ను నమ్మించి ప్రోత్సహించారు. దీంతో శశికుమార్ రూ.లక్ష ఇన్వెస్ట్ చేయగా నెలలో రూ.25 వేలు లాభం వచ్చింది. ఇంకా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితో మరింత లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో శశికుమార్ మిత్రులు, బంధువులకు తెలిపి వారి వద్ద నుంచి సొమ్ము తీసుకుని కంపెనీలో పెట్టుబడి పెట్టాడు. సాయికుమార్‌తో పాటు 14 మంది కంపెనీలో ఉద్యోగులుగా చేరి ఇతరులను కూడా ప్రోత్సహించారు. శశికుమార్ రూ.కోటి వరకు, మిగిలిన 14 మంది కూడా పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టారు. అయితే నవీన్‌కుమార్, సాయిపల్లవి గత 6 నెలలుగా వారికి వేతనాలు, లాభాలు చెల్లించడం లేదు. డబ్బులు విషయంపై అడుగగా 10 రోజుల నుంచి వాయిదాలు వేస్తున్నారు. ఇటీవల ఎటువంటి సమాచారం లేకుండా ఇల్లు వదిలి పోయినట్టు పోలీసులకు శశికుమార్ ఫిర్యాదు చేశాడు. తమను నమ్మించి మోసగించిన ఆ జంటపై చర్యలు తీసుకోవాలని కోరాడు. రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

12న ఉమ్మడి జిల్లా బాడీ బిల్డింగ్ పోటీలు

కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు

అమలాపురం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 12న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్‌లో శుక్రవారం పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కోనసీమ బాడీబిల్డింగ్ అసోసియేషన్, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు వివరించారు. జోనల్ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి సుమారు 250మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఈ పోటీలను 4 విభాగాలుగా పది కేటగిరీల్లో నిర్వహిస్తామని తెలిపారు. మెన్స్ 55కిలోలు, 60, 65, 70, 75, 75కిలోలు పైబడిన విభాగంలోను, మాస్టర్స్, దివ్యాంగులు విభాగంలో, ఫిజిక్ స్పోర్ట్స్ పోటీలను వేర్వేరుగా నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు పురస్కారాలతో పాటు షీల్డులు, మెడల్స్ అందజేస్తామన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మట్టపర్తి సముద్రం, నార్ని శ్రీను, చిక్కం రాజబాబు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

నేడు ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల న్యాయస్థానాల్లో జరిగే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని, ఉదయం 10 గంటల నుంచి కేసులు పరిష్కరిస్తామన్నారు.

నేడు భీమేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు

ద్రాక్షారామ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి జన్మనక్షత్రపూజలు శనివారం జరుగనున్నాయి. ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ, మేలుకొలుపు, ఉదయం 5 గంటలకు తీర్థపు బిందె, ప్రాతఃకాల అర్చన జరుపుతారు. అనంతరం మంత్రి సుభాష్‌తో సంకల్పం తర్వాత గణపతిపూజ, మహాన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం తదుపరి స్వామివారికి లక్షపత్రిపూజ, మాణిక్యాంబ అమ్మవారికి లక్షకుంకుపూజ నిర్వహిస్తారు. అనంతరం నందివాహనంపై నగరోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం మహా నివేదన, సాయంత్రం సోమవార మండపంలో ప్రదోషకాలార్చన నిర్వహిస్తారు. రాత్రి 9.30 గంటలకు నీరాజన మంత్ర పుష్పములు సమర్పిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన జరుగుతుందని అధికారులు తెలిపారు.

16న జాబ్ మేళా

కాకినాడ సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న కాకినాడ వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో వివిధ కంపెనీల టీమ్ లీడర్, ఎగ్జిక్యూటివ్ సేల్స్, అడ్వయిజర్, రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 30ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్ భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సరిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. 77993 76111లో సంప్రదించాలని కోరారు.

ఆదివారం కూడా వందేభారత్ ఎక్స్‌ప్రెస్

సామర్లకోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ-సికింద్రాబాద్ మధ్య సామర్లకోట మీదుగా ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును డిసెంబరు 15 నుంచి ఆదివారం కూడా నడుపనున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు ఆదేశాలు జారీ చేశారు.

20833 నంబరు గల విశాఖ- సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ విశాఖలో ఆదివారం ఉదయం 5.45 గంటలకు బయలుదేరి సామర్లకోటకు 7.13 గంటలకు, రాజమహేంద్రవరానికి 7.53 గంటలకు, విజయవాడకు 9.50 గంటలకు, ఖమ్మం 11.00 గంటలకు, వరంగల్‌కు 12.05 గంటలకు, సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 2.15 గంటలకు చేరుకుంటుంది.

20834 నంబరు గల సికింద్రాబాద్-విశాఖ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో ఆదివారం సాయంత్రం 3 గంటలకు బయలుదేరి వరంగల్‌కు 4.35 గంటలకు, ఖమ్మం 5.45 గంటలకు, విజయవాడకు రాత్రి 7 గంటలకు, రాజ మహేంద్రవరానికి 8.53 గంటలకు, సామర్లకోటకు 9.33 గంటలకు, విశాఖకు రాత్రి 11.35 గంటలకు చేరుతుందని తెలిపారు.

మరిడమ్మకు స్వర్ణపుష్పాలతో అర్చన

పెద్దాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో శుక్రవారం అర్చన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పంటకోత ప్రయోగంలో ఎకరానికి 30 బస్తాలు



దుర్గాడలో వరి పంటకు పంటకోత ప్రయోగాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందారు ఒక రైతు. గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన రైతు సింగులూరి సీతారాంబాబు 2 ఎకరాల విస్తీర్ణంలో ఆర్‌జీఎల్ రకం వరిని సాగు చేశారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగిన ఈ రైతు రసాయిన ఎరువులు వినియోగించకూడదని నిర్ణయించుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భీజామృతంతో విత్తన శుద్ధి చేసి పుల్లటి మజ్జిగ, మీనామృతం, పేడ, ఇంగువ, మూత్ర ద్రావణం పిచికారీ చేస్తూ తెగుళ్లు ఆశించకుండా చేయడంతో పంట ఆశాజనకంగా పండింది. శుక్రవారం ఈ 2 ఎకరాల పొలంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఎకరానికి సగటును 30 బస్తాల దిగుబడి లభించింది. సార్వా సాగులో పెట్టుబడులు పోను లాభం మిగులుతుందని రైతు చెప్పారు.

కాకినాడ ఆర్టీసీ డిపోలో 'డయల్ యువర్ డీఎం'

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపో నందు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. పలువురు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. కాకినాడ నుంచి జి.మామిడాడ, రాయవరం మీదుగా రావులపాలెనికి, కాకినాడ నుంచి రావులపాలెం, వాడపల్లికి జి.మామిడాడ, పందలపాక మీదుగా బస్సు తిప్పాలని, కాకినాడ ప్రతాప్‌నగర్ బ్రిడ్జి వద్ద రాజమండ్రి నాన్‌స్టాప్ బస్సులకు స్టాపు, కౌంటర్ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ ఎంవి మనోహర్ తెలిపారు.

పోలీసుల కవాతు

కాకినాడ క్రైం, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ పోలీస్ సబ్ డివిజన్‌కు చెందిన అన్ని లా అండ్ అర్డర్, ట్రాఫిక్, క్రైం సిబ్బందికి అలాగే సంబంధిత అధికారులకు కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఎస్‌డిపిఓ రఘువీర్ విష్ణు మాట్లాడుతూ విధులు నిర్వర్తించే సమయంలో మంచి నైపుణ్యం ప్రదర్శించేందుకు కవాతు, యోగా ఎంతో దోహదపడతాయన్నారు.

బీచ్‌పార్కులో పనులను వేగంగా పూర్తి చేయాలి

కాకినాడ కమిషనర్ భావన

సర్పవరం జంక్షన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ బీచ్‌పార్కు, యుద్ధ మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులను యుద్ధప్రాతికన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్, కౌడా వైస్ చైర్‌పర్సన్ భావన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌పార్కు, యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20న బీచ్‌పార్కులో నిర్వహించనున్న ఉత్సవాల నేపథ్యంలో అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. రోడ్డు, డివైడర్ మధ్య గ్రీనరీ, ఆర్చ్ వంటి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే యుద్ధ మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీచ్‌పార్కు, యుద్ధ విమాన మ్యూజియం పనులపై పలు సూచనలు చేశారు. కౌడా సెక్రటరీ కాశీబాబు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.





యుద్ధ విమానాన్ని పరిశీలించి వస్తున్న కమిషనర్ భావన, బీచ్‌పార్కులో పర్యటిస్తున్న కమిషనర్

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంఘం నిధులు మంజూరు పొందడానికి, నగర అభివృద్ధికి దోహదపడే పన్నుల వసూలు విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వద్దని పన్ను బకాయిదారులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన రెవెన్యూ శాఖాధికారులకు ఆదేశించారు. ఆస్తి, నీటి పన్నుల బకాయిలు, నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్సులోని దుకాణాల అద్దె బకాయిల విషయమై కమిషనర్ శుక్రవారం రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. పన్ను వసూలు విషయంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు కార్యాచరణ రూపొందించుకుని పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలు రూ.20కోట్లపై దృష్టి సారించాలన్నారు. నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్సుల్లో దుకాణాలకు అద్దె చెల్లించకుండా బకాయిపడ్డ వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు ఆషాపులను సీజ్ చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.మనోహర్, రెవెన్యూ అధికారులు కోట శిరీష్‌కుమార్, నిర్మలాకుమారి,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పిఠాపురంలో 23 నుంచి శత చండీ మహాయాగం

పిఠాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్‌రోడ్డులో సద్గురు గోపాల్ బాబా ఆశ్రమంలో ఈనెల 23,24,25వ తేదీల్లో శ్రీ మహారుద్ర సహిత శత చండీ మహాయాగాన్ని నిర్వహించనున్నారు. 108 యజ్ఞకుండలాలు, 116మంది రుత్విక్కులతో 3రోజుల పాటు జరిగే ఈ చండీ మహాయాగానికి సంబంధించిన వివరాలను శుక్రవారం శ్రీసన్నిధి శర్మ సేవా ట్రస్టు ప్రతినిధులు వడ్లమాని సుబ్రహ్మణ్యశర్మ అవధాని, శ్రీసన్నిధి సత్యం వెల్లడించారు. 50మంది సిద్ధ గురువులు, యోగులు, నాగసాధువుల సమక్షంలో ఈ మహాక్రతువు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, లోక కల్యాణార్థం ఈ క్రతువు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ యాగంలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లేని వారు కోసం ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పాల్గొనదలచిన వారు నిర్వాహకులను ఫోన్ 8074767317 లేదా 9059702956 లేదా 9392021119లో సంప్రదించి తమ పేర్లు రిజిస్టర్ చేయించుకోవాలని వారు సూచించారు.

మహాసంస్థానంలో గులాబి, సంపెంగ అర్చన



శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు ప్రత్యేక అలంకారం

పిఠాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న దత్త జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరోరోజు విశేషపూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు సహస్ర గులాబి, సంపెంగ పుష్ప పూజ నిర్వహించారు. అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, సాయంత్ర అగ్నిప్రతిష్టాపన, దత్తమంత్రహోమం నిర్వహించి వివిధ హారతులు ఇచ్చారు.

సహస్ర చామంతి అర్చన

పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహమహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐదోరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు స్వామికి సహస్ర చామంతి పుష్ప పూజ జరిగింది. దత్తాత్రేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 32 మందికి కాకినాడ మూడవ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజేస్ట్రేట్ వి. నరసింహరావు జైలు, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్ సిఐలు, ఎస్ రమేష్ డి.రామారావు తమ బృందాలతో గురువారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్నవారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 32 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా 15 మందికి ఒక్కొక్కరికి 2రోజుల చొప్పున జైలు శిక్ష, మిగతా 17 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

సచివాలయ సిబ్బంది అత్యుత్సాహం



కొండెవరంలో కూటమి నేతల వాగ్వివాదం

కూటమి నేతల మధ్య వివాదం

కొత్తపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది అత్యుత్సాహం వల్ల కొండెవరంలో కూటమి నేతల మధ్య వివాదం ఏర్పడింది. గ్రామంలో ఎటువంటి కార్యక్రమం ఏర్పాటుచేసినా టీడీపీకి చెందిన ప్రజాప్రతి నిధులు, నాయకులకు గానీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కేవలం వైసీపీకి నుంచి జనసేనలోకి చేరిన వారికే సమాచారం ఇవ్వడంపై కొండెవరం టీడీపీ నాయకులు గాది రాజబాబు, వేమగిరి రాంబాబు, ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు కొత్తపల్లి ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ సత్యరెడ్డి సచివాయంలో టీడీపీ ప్రజాప్రతినిధుల సమక్షంలో విచారణ నిర్వహించారు. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేయాలని ఎంపీడీవో పంచాయతీ, సచివాలయ సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. ఈలోగా జనసేన, బీజేపీకి చెందిన నాయకులు మారిశెట్టి బుజ్జి, వాసంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు సచివాలయానికి చేరుకుని తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు అక్కడ నుంచి వైదొలగడంతో కూటమి నాయకుల మధ్య వాగ్వాదం జరిగి టీడీపీ నాయకులు అసహనంతో బయటకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు, టీడీపీ సీనియర్ నేతలు గాది రాజబాబు, వేమగిరి రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైసీపీలో ఉన్న నాయకులు ప్రస్తుతం జనసేనలోకి వచ్చి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో టీడీపీకి రాజీనామాలు చేయడం తప్ప వేరే దారిలేదని ఆవేదన చెందారు.

రేపటి నుంచి దత్తజయంతి ఉత్సవాలు

గొల్లప్రోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో దత్తాత్రేయస్వామి జయంతి ఉత్సవాలు ఈనెల 15 నుంచి ప్రారంభంకానున్నాయి. 15న దత్తస్వాములతో విష్వక్సేన పూజలు. ఆరాధన అభిషేకాలు, లక్ష తులసి పూజ, హోమం, పూర్ణాహుతి, సాయంత్రం దీపాలంకరణ సేవ, 16వ తేదీన ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు 17వతేదీన స్వామికి విశేషపూజలు, అభిషేకాలు జరుగుతాయి.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



ఆర్జేడీ నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కాకినాడ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్,కార్పొరేషన్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణికి ఎస్టీయూ కాకినాడ జిల్లా అధ్యక్షులు మోర్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్ అధ్యక్షతన శుక్రవారం వినతిపత్రం అందజేశారు. డిసెంబరు 6న జరగాల్సిన ప్రమోషన్ల షెడ్యూల్ ఎలక్షన్ కోడ్ కారణంగా నిలిచినందున వెంటనే పదోన్నతులు చేపట్టాలని, నాయకత్వ, ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించి జిల్లా కేంద్రమైన కాకినాడలో శిక్షణా తరగతులు చేపట్టాలని కోరారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల సబ్జెక్టుస్థానంలో కొరత ఉన్న పాఠశాలలకు డిప్యూటేషన్‌పై మిగులు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. వినతి అందజేసినవారిలో ఎస్టీయూ రాష్ట్రకార్యదర్శి యు.శ్రీను నాయకులు వెంకటేశ్వరరావు, పి.శ్రీను, రామకృష్ణ, మహేష్, సత్యనారాయణ, ప్రసన్నకుమార్ ఉన్నారు.

ఆకట్టుకున్న ప్రపంచ చెస్ చాంపియన్ చిత్రం



సర్పవరం జంక్షన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీకి చెందిన చిత్రకారుడు వెంకటేష్ గీసిన ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేష్ చిత్రం ఆకట్టుకుంది. గురువారం సింగపూర్‌లో జరిగిన ప్రపంచ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో భారత గ్రాండ్ మాస్టర్ విశ్వవిజేతగా నిలిచిన గుకేష్ చిత్రాన్ని గీసి అబ్బురపరిచాడు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు





నడకుదురు సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే నానాజీ, మాజీ మంత్రి చిక్కాల, పటవలలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

ఎమ్మెల్యే పంతం నానాజీ

కరప, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని, రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. నడకుదురులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈసదస్సుకు 16దరఖాస్తులు వచ్చినట్టు తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ తెలిపారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.వేణుగోపాలరావు, మండల ప్రత్యేకాధికారి జి.శ్రీనివాసరావు, సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంఈవో కృష్ణవేణి, ఆర్ఐ పవన్, వీఆర్‌వోలు కుంపట్ల గణపతి, చాగంటి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

తాళ్లరేవు, డిశంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను పరిష్కరించే సదస్సులను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శుక్రవారం పటవల పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ పి. త్రినాదరావు అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. గ్రామసభ లక్ష్యాలను, పరిష్కారాలను ఎంపీపీ సునీత వివరించారు. 16మంది సమస్యలు పరిష్కరించాలని అర్జీలను అందించారు. ఈసమావేశంలో సర్పంచ్ పినపోతు చిన కామేశ్వరరావు, డిటీ సూరిబాబు, ఆర్ఐ రామకృష్ణ, కార్యదర్శి రామరాజు, టీడీపీనాయకులు రాయుడు గంగాధర్, బజన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలపై వినతుల స్వీకరణ

సామర్లకోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సామర్లకోట మండలం పనసపాడు, కొప్పవరం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహశీల్దార్ మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తా మని, ప్రతీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. సదస్సులో సర్పంచ్ చీకట్ల వెంకటేష్, వీరంరెడ్డి పెదబాబు, వీరంరెడ్డి చినబాబు, ముమ్మిడి సోమరాజు, నోడల్ అధికారి రాధాకృష్ణ, వీఆర్వోలు ఖాదరవల్లీ, వాసు, సర్వేయర్లు, తదితర సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. ఉండూరు, పనసపాడు, కొప్పవరం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 35అర్జీలు అందినట్లు తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి వెల్లడించారు.

ప్రసన్నాంజనేయునికి పుష్పాభిషేకం



ఆంజనేయుడికి పుష్పాలు, తమల పాకులతో అభిషేకిస్తున్న దృశ్యం

సామర్లకోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద శుక్రవారం రాత్రి 65అడుగుల ఎత్తున శిరస్సు పైభాగం నుంచి ఘనంగా పుష్పాభిషేకం, తమలపాకులతో అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం పాదాల చెంత పండ్లతో సర్వాంగసుందరంగా అలంకరించారు. పండితులు మహంకాళి వెంకటరామమూర్తి తదితర పండితులు విశేష పూజలు నిర్వహించారు. లక్ష తమలపాకులు, లక్ష పుష్పాలతో శిరస్సు మీదుగా అభిషేకించగా వందలాది భక్తులు జైహనుమాన్ అంటూ నినదించారు. పులిహోర, ప్రసాదం పంపిణీ చేశారు.

ఘనంగా హనుమద్ వ్రతం

కరప, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శుక్రవారం హనుమద్ వ్రతాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వలసపాకల, అరట్లకట్ట గ్రామాల్లోని భారీ అభయాంజనేయస్వామి విగ్రహాల వద్ద తమలపాకులతో లక్షార్చన అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కరప వేణుగోపాలస్వామి ఆలయంలోని అభయాంజనేయస్వామికి అర్చకులు పెద్దింటి గోపాలకృష్ణ, సూర్యనారాయణలు పూజలు నిర్వహించారు. నడకుదురు, పెనుగుదురు, వేళంగి, పేపకాయలపాలెం, గొర్రిపూడి, కొరుపల్లి తదితర గ్రామాల్లో హనుమద్రతం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సర్పవరం జంక్షన్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు ముమ్మిడి కామరాజు, వైస్ ప్రెసిడెంట్ చౌదరి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఘనంగా హనుమద్రత్య వ్రతం నిర్వహించారు. శ్రీఅభయాంజనేయస్వామి 13వ వార్షికోత్సవం పురస్కరించుకుని భక్తులు సత్తి వీరాస్వామి రాజా దంపతుల ఆధ్వర్యంలో 108మంది దంపతులతో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా హనుమద్రత్య మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా లక్షపత్రి పూజ శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: దుర్గాడ శివాలయంలో శుక్రవారం హనుమత్ వ్రత పూజలు జరిగాయి. ముందుగా గణపతిపూజ నిర్వహించి ఆలయంలో కొలువై ఉన్న దాసాంజనేయ స్వామికి మన్యుసూక్తముతో అభిషేకం, నాగవల్లి దళార్చన, సింధూర పూజలు చేశారు. ఆలయ సేవాసమతి సభ్యులు, భక్తులు శ్రీరామనామముతో భజనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు.

వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు

పిఠాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం ప్రముఖ నటుడు విక్టరీ వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. విక్టరీ వెంకటేష్ హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంస్థ సభ్యులు, అభిమానులు వడ్డి నాని, నాగబాబు, రామకృష్ణ, సాయి, అనుశ్రీ సత్యనారాయణ, వెంకటేశ్వర థియేటర్ యజమాన్యం పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ద్వారా సేవా కార్యక్రమాలు

కరప, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ ద్వారా పలు సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ జనరల్ మేనేజర్ నక్కా శ్రీనివాసరావు తెలిపారు. కరప హైస్కూల్‌కు కెనరా బ్యాంక్ తరపున కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుంచి రూ.3లక్షలు విలువైన 42 డెస్క్‌లను శుక్రవారం పాఠశాలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే పాఠశాలలో తాను చదువుకుని ఈస్థాయికి వచ్చానని, ప్రతీఒక్కరూ సామాజిక సేవాకార్యక్రమాల్లో ముందుండాలన్నారు. డీజీఎంను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఆర్.గణేష్, డిప్యూటీ కలెక్టర్ పి.వేణుగోపాలరావు, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ, అడ్వకేట్ నక్కా నరసింహరావు, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్న, హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్య తరగతి వర్గాలకు వరమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. శుక్రవారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసం వద్ద కాకినాడ రూరల్‌కు చెందిన లబ్ధిదారుడు సూర్యభాస్కర్ కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.7లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య చికిత్సల కోసం ఖర్చుచేసిన నగదును ప్రభుత్వం రీయంబెర్స్‌మెంట్ చేస్తుందన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

పిఠాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పిఠాపురం పురపాలకసంఘ టీడీపీ ఫ్లోర్‌లీడర్, కౌన్సిలరు అల్లవరపు నగేష్ సూచించారు. పిఠాపురం పట్టణంలోని వార్డు సచివాలయం-5లో శుక్రవారం నిర్వహించిన అర్బన్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 10,11 వార్డుల్లో చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత, పారిశుధ్య నిర్వహణ, పిల్లల ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో కౌన్సిలరు రాయుడు శ్రీనుబాబు, అడ్మిన్ గంగాధర్, హెల్త్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలు భవానీ, వరలక్ష్మీ, వెంకటలక్ష్మీ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



కల్యాణవేదికను ప్రారంభిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 13(ఆంధ్ర జ్యోతి): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, రాష్ట్రప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణవేదిక మొదటి అంతస్తును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్రహ్మణ్య ఆరాధనతో అంతా మంచి జరుగుతుందన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా జగ్గయ్యచెరువు కాలనీ



కమిషనరుకు వినతిపత్రం అందజేస్తున్న అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు తదితరులు

పిఠాపురం, డిసెంబరు 13: పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన శుక్రవారం మునిసిపల్ కమిషనరు కనకారావును కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ ఏర్పడిన రెండు దశాబ్దాలు గడిచినా పలు వీధుల్లో రోడ్లు, డ్రెయిన్లు లేవని, పలు వీధుల్లో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతుందని రాంబాబు తెలిపారు. 20,21,22 వార్డుల్లో కేవలం ముగ్గురు పారిశుధ్య కార్మికులే విధులు నిర్వర్తిస్తున్నారని, చెత్త ఎత్తేనాధ ఎడే లేరని చెప్పారు. నెలకు ఒకసారే వీధుల్లో చెత్త తీస్తున్నారని తెలిపారు. వీధిలైట్లు వెలగడం లేదని, తాగునీరు అందడంలేదని చెప్పారు. కాలనీఅంతా తాగునీటి సరఫరాకు డిస్ట్రిబ్యూషన్ లైన్‌ఏర్పాటు చేయాలని, వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ మెరుగపరచాలని కోరారు.

పి.వెంకటాపురం యానిమేటర్‌పై విచారణ నిర్వహించాలి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న పి.వెంకటాపురం యానిమేటర్ (వీవోఏ) వల్లు కనక మహాలక్ష్మిపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మహిళా శక్తిసంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం రమణయ్యపేటలో ఎంపీడీవో పసుపులేటి సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ బ్యాంకు మంజూరు చేసిన రుణాలను సకాలంలో సభ్యులకు ఇవ్వకుండా దుర్వినియోగం చేస్తోందన్నారు. గతంలో రూ.12.80లక్షలు బ్యాంకు నుంచి డబ్బులు డ్రాచేసి వస్తూండగా ఆటోలో రూ.5లక్షలు పోయాయంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. మిగిలిన రూ7.80 లక్షలు సభ్యులకు ఇవ్వకుండా, బ్యాంకులో జమ చేయకుండా ఏడాది పాటు ప్రైవేట్‌గా వడ్డీలకు ఆ డబ్బు రొటేషన్ చేసిందన్నారు. ఈవిషయం తమకు చెప్పకుండా మోసం చేసిందని ఆరోపించారు. యానిమేటర్ అక్రమాలపై డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తక్షణమే యానిమేటర్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ

జగ్గంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):సంకల్పం 2025లో కార్యక్రమంలో భాగంగా జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఉచితంగా శుక్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ఉత్తీర్ణత పెంచేలా విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని అధ్యాపకులు ఆకాంక్షించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన యువతకు ట్రైకార్ ద్వారా ఉపాధి

రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు



మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు

రంపచోడవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో గిరిజన యువతకు ట్రైకార్ ద్వారా ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, ట్రైకార్ డైరెక్టర్లు పి.లావణ్య, టి.అనురాధ, కె.కృష్ణారావులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజనులకు సబ్సిడీపై వాహనాలు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి సమర్పించాలన్నారు. గిరిజన యువతకు వివిధ రకాలైన శిక్షణలు ఏర్పాటు చేయాలన్నారు. తేనె పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం అందించాలన్నారు. ప్రతి గ్రామానికి లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మిరియాల శిరీషదేవి మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఎస్సీ కోచింగ్ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వాలన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఐటీడీఏ కృషి చేస్తోందన్నారు. తొలుత ఏపీవో(జీ) డీఎన్వీ రమణ ఐటీడీఏ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, వంతల రాజేశ్వరి, ఎస్టీసీ జాన్‌రాజ్, డీప్యూటీ డైరెక్టర్లు విజయశాంతి, షరీఫ్, ఈఈలు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో శిరీష, పీహెచ్‌వో చిట్టిబాబు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు స్ఫూర్తిదాయకంగా ఉండాలి

ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా



మాట్లాడుతున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాపోటీలు స్ఫూర్తిదాయకంగా ఉండాలని ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా అన్నారు. శుక్రవారం చింతూరులో జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ మెగా క్రికెట్ టోర్నీ సీజన్-1 మొదలైంది. టోర్నీని ఏఎస్పీ పంకజ్ కుమార్‌మీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. టోర్నీతో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచడమన్నది అభినందనీయమన్నారు. అనంతరం జేకేసీటీ చైర్మన్ జమాల్‌ఖాన్ మాట్లాడుతూ సీజన్-1లో ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలకు చెందిన 72 జట్లు తలపడనున్నట్లు తెలిపారు. విజేత టీంకు రూ.50వేలు, రన్నర్ టీంకు రూ.30వేలు బహుమతిగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో సీఐ దుర్గారావు, ఎస్ఐ రమేష్, బీజేపీ నాయకులు పాయం వెంకయ్య, డీవీఎస్ రమణారెడ్డి, జనసేన నాయకుడు మడివిరాజు, ఆదివాసీ నాయకుడు జల్లి నరేష్ పాల్గొన్నారు.

సంచుల కొరత

వరరామచంద్రాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని జల్లివారిగూడెం పంచాయతీ పరిధిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం నింపేందుకు సంచులు లేక రైతులు ఎదురుచూస్తున్నారు. శుక్రవారం ఎంపీపీ కారం లక్ష్మి, సీపీఎం బృందం జల్లివారిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. చుట్టు ప్రక్కల రైతులు ధాన్యం నింపేందుకు కొనుగోలు కేంద్రంలో సంచులులేవని ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లారు 15 రోజులుగా ధాన్యం రోడ్డుపైనే బరకాలుకప్పి సంచుల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షంవస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని వెంటనే సంబంధిత ఉన్నతస్థాయి అధికారులు స్పందించి ధాన్యం నింపేందుకు సంచులు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. సీపీఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్, నాయకులు పొడియం శ్రీరామూర్తి, గుండిపూడి లక్ష్మణరావు, జల్లి సత్య నారాయణ, రాజు, తమ్మయ్య పాల్గొన్నారు.

చదువుల్లో నైపుణ్యతను పెంపొందించుకోవాలి

శిక్షణా కార్యక్రమంలో ఆర్‌జేడీ చిన్మయిదేవీ

ఎటపాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కౌమార దశలోని బాలికలు చదువుల్లో నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఆర్‌జేడీ జి, చిన్మయదేవీ అన్నారు. శనివారం ఎటపాక మండల పరిషత్ సమావేశ హాల్లో కిషోరి వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 11నుంచి 18ఏళ్ల వయస్సు మధ్యలోని కౌమార దశ బాలికలు ప్రస్తుత సమాజంపై పూర్తి అవగాహనకల్గి ఉండాలని, వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని అన్నారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వ సాధికారత సమగ్ర అభివృద్ధి కోసం కిషోరశక్తి యోజనను మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ద్వారా ప్రారంభించిందన్నారు. గ్రామస్థాయిలో బడి బయట ఉన్న బాలికలను గుర్తించి, వారిని పాఠశాలకు పంపేందుకు పంచాయతీ, ఎస్ఎంసీ, చైల్డ్‌ప్రొటెక్షన్ కమిటీ, ఎస్ఎస్ఏ అధికారి, ఉపాధ్యాయులు, ఎస్‌హెచ్‌జీలతో అనుసంధానం చేసి, పని చేయాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎటపాక సీఐ కన్నపరాజు, సీడీపీవో గౌరిప్రియ , ఎంఈవో లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

విద్యార్థినిలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అడ్డతీగల: ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి మంచి విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు విద్యార్థినులకు సూచించారు. శుక్రవారం అడ్డతీగల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలి కోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధ ఆధ్వర్యంలో కిషోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యన్.ఆర్. స్వామి, హెచ్‌ఎం లోవమ్మ, ఎంపీహెచ్ఎస్ అప్పల నర్సమ్మ, లక్ష్మీ సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళదాం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు ఎడవిల్లి భాస్కరరావు

కూనవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో ఇంటి స్ట్రక్చర్ వాల్యూయేషన్‌లో సమస్యలు తలెత్తాయని నిర్వాసితులు భావిస్తున్నారని ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళదామని టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు అన్నారు. కూనవరంలో నిర్వాసితుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రక్చర్ వాల్యూయేషన్‌తోపాటు మరికొన్ని గ్రామాలు నిర్వాసితుల జాబితాలో లేవని ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. మండలంలో అందరూ కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఇరిగేషన్ మంత్రిని కలుద్దామన్నారు. కార్యక్రమంలో గుజ్జా మోహనరావు, కొత్తా రామ్మోహన్‌రావు, డాక్టర్ వెంకయ్య, సూర్యచంద్రరావు, సీపీఐ మండల కార్యదర్శి శ్రీను, మరియదాసు పాల్గొన్నారు.

ఆత్మగౌరవాన్ని దెబ్బతీయవద్దు

చింతూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకులు ఇటీవల తరచూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బలరాం బొడ్డు పేర్కొన్నారు. శుక్రవారం చింతూరులో ఆయన సంఘ సమావేశంలో మాట్లాడారు. విశాఖపట్నం నగర కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ వార్డు సచివాలయ ఉద్యోగు లను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చే శారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పండ రఘుబాబు, మానె వినోద్‌కుమార్, చిన్న, బాబూరావు, వేక అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'షాడో పాలన ఎవరిదో అందరికీ తెలుసు'

చింతూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): షాడో పాలన అనే మాట మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి నోట వినడం విడ్డూరమని టీడీపీ చింతూరు మండలశాఖ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే శిరీషదేవికి ఎవరూ షాడోలు లేరన్నారు. గడచిన పదేళ్లలో ఎవరు ఎవరికి షాడోగా వ్యవహరించారో ప్రజలకు తెలుసని చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. హత్యా రాజకీయాలు, అధికారులను బెదిరించడం, వసూళ్ల లాంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడడం ఎమ్మెల్యే శిరీషదేవికి తెలియదన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు

జగ్గంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నిలకు శనివారం నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. చెరువు లు, ఏలేరు చైర్మన్ పదవుల కోసం శనివా రం ఉదయం నామినేషన్ దాఖలు చేయ డం, రైతులతో ఎన్నికల అనంతరం మధ్యాహ్నం ఫలితం వెలువడుతుందని జగ్గంపేట తహసీల్దారు రమేష్‌బాబు చెప్పారు. ఆయా గ్రామాల్లోని మండల పరిషత్ స్కూళ్లలో ఎన్నికలకు ఏర్పాట్లుచేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన

జగ్గంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్షర జూనియర్ అండ్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు సైబర్ క్రైం నేరాలు, మోసాల గురించి మహిళా రక్షక్ అవగాహన కార్యక్రమం సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటి నేరాలు, బ్యాగ్ లిఫ్టింగ్, దొంగతనాల నివారణ, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలవల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ రఘునందన్‌రావు, కాలేజీ చైర్మన్, కరస్పాండెంట్ సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ చక్రధొర పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం చెప్పారు. మండలంలోని ధర్మవరం దళితవాడలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలపట్ల నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆమె ప్రసంగించారు. ఈ సమావేశంలో దళిత నాయకుడు బి.నారాయణుడు, టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, పుణ్యమంతుల శ్రీను, కృష్ణబాబు, వాల్టెన్, నూకరాజు, చిన్న, రాజా, ఏసు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలని ఆందోళన

ప్రత్తిపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6నెలలు గడుస్తున్నా ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడం లేదని ముఖ్యంగా అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, శుక్రవారం వైసీపీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మవరంలో కార్యకర్తలు ప్లేకార్డులతో ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో రైతుల ఆక్రందనలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఈ ఆందోళనలో నానిపల్లిచంటి, బొల్లు నాగేశ్వరరావు, దొడ్డిపట్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారంతా కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనకు తరలివెళ్లారు.

చురుగ్గా అభివృద్ధి, సంక్షేమ పనులు

గండేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిలో యువ నాయకుడు జాస్తి వసంత్ ఆధ్వర్యంలో సుమారు రూ.1.50 కోట్లతో రోడ్డు పనులు పూర్తవుతున్నాయి. గండేపల్లి నుంచి సింగరంపాలెం, తాళ్లూరు నుంచి యల్లమిల్లి మార్గాలను ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అభివృద్ధి చేస్తున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సత్యదేవుని మెమెంటో అందజేస్తున్న ఈవో

అన్నవరం, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులు వేగవంతంగా పరిస్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ విక్రాంల్ పాటిల్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం సాయంత్రం అన్నవరం పోలీస్‌స్టేషన్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేట్‌ను తగ్గించాలని అదేవిధంగా అన్నవరం దేవస్థానంలో ఉత్సవాలు, పర్వదినాల్లో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రత్నగిరిపై సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ పీఆర్వోకొండలరావు మర్యాదతో స్వాగతం పలికి సత్యదేవుడి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఎస్ఐ హరిబాబు ఉన్నారు.

రౌతులపూడి పోలీస్‌స్టేషన్ తనిఖీ

రౌతులపూడి: రౌతులపూడి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ శుక్రవారంరాత్రి పరిశీలించారు. వార్షిక తనిఖీలులో భాగంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. కేసులు గురించి సిబ్బందిని ప్రశ్నించారు. ఈయన వెంట డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెగా క్రిస్మస్ వేడుక

రౌతులపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు. బలరామపురంలో యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అఫ్ రౌతులపూడి శుక్రవారం నిర్వహించిన పాస్టర్స్ ఫ్యామిలీ మెగా క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, పసగడుగుల రమణ, పైల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఎమ్మెల్యే జ్యోతులకు సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అధ్యాపకులు

జగ్గంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాక శివాలయంవద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను గోకవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కేఎస్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి రజత విగ్రహాన్ని జ్ఞాపికగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ఆరంభంలో పుస్తకాల పంపిణీ నిమిత్తం కాలేజీకి వచ్చిన ఎమ్మెల్యే ఇక్కడి రోడ్డుచూసి చలించిపోయారన్నారు. వెంటనే గ్రాంట్ శాంక్షన్ చేయించి సిమెంటు రోడ్డు వేయించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మంగరౌతు రామకృష్ణ, సిద్దా పవన్‌కుమార్, అధ్యాపకులు టి.శ్రీనివాస్, పి. సంధ్య, పి.రేవతి, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదిత్యలో లవ్ యువర్ ఫాదర్ ఆడియో రిలీజ్



ఆదిత్యలో లవ్ యువర్ ఫాదర్ సినిమా ఆడియో రిలీజ్‌లో దృశ్యం

గండేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఆవరణలో ఎల్‌వైఎఫ్(లవ్ యువర్ ఫాదర్) సినిమా ఆడియో రిలీజ్ సాంగ్‌ను రిలీజ్ కార్యక్రమం ఆదిత్య విద్యార్థుల సమక్షంలో ఉత్సాహంగా సాగింది. ఎల్‌వైఎఫ్ నూతన దర్శకుడు పవన్ కేతరాజు రచించి, దర్శకత్వం వహించారు. ప్రధానపాత్రలో హీరో హర్షవర్ధన్ తొలి పరిచయం, కాశికాకపూర్ హీరోయిన్‌గా ప్రధానపాత్రలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ నటిస్తున్నారు. ఈసందర్భంగా ఆదిత్య యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమానికి ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మొదటి పాటను విడుదలచేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రదర్శకుడు పవన్ కేతరాజు మాట్లాడుతూ పుష్ప2 చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని ఈ చిత్రాన్ని స్వీయ కథతో దర్శకత్వం వహిస్తున్నట్లు తెలిపారు.

ఆదిత్య యూత్ ఫెస్ట్ కలర్స్ 2కె25 పోస్టర్ విడుదల



కలర్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదిత్య ఛాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఆదిత్య కలర్స్ 2కె25 పోస్టర్‌ను శుక్రవారం ఆదిత్య యూనివర్శిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. 2025 జనవరి 9,10,11 తేదీల్లో ఆదిత్య యూత్ ఫెస్ట్ కలర్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో అద్భుతంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలను, అభిమానాన్ని అందుకున్న ఆదిత్య యూత్ ఫెస్ట్‌కలర్స్ కొంత విరామం తర్వాత మరలా ప్రారంభిస్తున్నామన్నారు. విద్యార్థుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ యూత్‌ఫెస్ట్ నిర్వహించడానికి అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిప్యూటీ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎం బీశ్రీనివాసరావు, ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్‌కుమార్, డాక్టర్ విశాల్‌చవాన్, ఎస్‌టీవీఎస్ కుమార్, ఎ.విజయభార్గవి, డీన్స్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం

ఎటపాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సుల ముఖ్యఉద్దేశం గ్రామాల్లో నెలకొన్న భూ సమస్య ల పరిష్కారం కోసమేనని తహసీల్దార్ కారం సుబ్బారావు అన్నారు. శనివారం రెవెన్యూ సదస్సుల తొలిరోజు కార్యక్రమంను కన్నాయి గూడెంలో ప్రారంభించారు. కన్నాయిగూడెం పంచాయతీలోని సీతంపేట, కన్నాయిగూడెం, తాళ్లగూడెం గ్రామాల పరిధిలో భూసమస్యలపై మొత్తం 14 దరఖాస్తులను అందించారు. స్పెషల్ ఆఫీసర్ మురళీ, మండల సర్వేయర్ జగన్నాధరావు సర్పంచ్ పెనుబల్లి నాగమణి, ఆర్ఐ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు శనివారం మండలంలో ప్రారంభమయ్యాయి. మండల దిగువనున్న దాలిపాడు పంచాయతీలో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలోను ఎగువనున్న దారగడ్డలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకరరావు ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. మ్యుటేషన్లు, భూ సమస్యలపై పలు దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అన్నారు. సదస్సుల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజలు, పలు శాఖలాధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రంపచోడవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయంలో శుక్రవారం ఆంజనేయస్వామికి హనుమ ద్రవ్రతం సందర్భంగా అర్చకులు వెంకటేశ్వరశర్మ అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఐ.పోలవరం గోవిందగిరి వెంకటేశ్వస్వామి ఆలయంలో ఆలయ అధికారి నారాయణరాజు ఆధ్వర్యంలో అభిషేకసేవ నిర్వహించారు. అనం తరం విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ ప్రముఖ్ మాట్లాడుతూ గోవిందగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతినెలా 2వ శనివారం తిరుమల తిరుపతి ప్రసాదం అందుబాటులో ఉంటుందని ప్రసాదం కోసం తమ ఆధార్‌కార్డు తీసుకురావాలని తెలిపారు. అర్చకులు గోవర్ధనం శ్రీ మణి కంఠాచార్యులు, దీవి పార్థ శ్రీనివాస్, సాయిరాం శర్మ పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఊరేగింపు

కూనవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న విజయదుర్గాలయంలో ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభాన్ని శుక్రవారం భక్తులు ఊరేగించారు. కూనవరం, టేకులబోరు గ్రా మాల్లో ఈ ధ్వజ స్తంభాన్ని ఊరేగించారు. శని, ఆదివారాల్లో ఆలయంలో హోమాలు నిర్వహించి ఆదివారం ఉదయం 8.17 నిమిషాలకు ఈ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఊరేగింపు కార్యక్రమంలో భవానీ, అయ్యప్ప మాలధారణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమారిటెన్స్ చేయూత

చింతూరు, డిసెంబరు 13 (డిసెంబరు): ఏజెన్సీలో ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందాలన్నదే తమ లక్ష్యమని సమారిటెన్స్ ఫర్ దనేషన్ ఫౌండర్ పి.రాంకుమార్ పేర్కొ న్నారు. సంస్థ నేతృత్వంలో శుక్రవారం చింతూరు ఏరియా ఆసుపత్రికి రూ.లక్షా 70వేల విలువగల బేబీ కిట్లు, మందులు అందజేశారు. ఈ సంద ర్భంగా రాంకుమార్ మాట్లాడుతూ చలికాలంలో చిన్నారులు చలిబారిన పడి వివిధ వ్యాధులబారిన పడే ప్రమాదమున్నందున ఈ సహకారం అందించామన్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎంవీ కోటిరెడ్డి మాట్లాడుతూ సమారిటెన్సు ఫర్‌ద నేషన్ ఈ ఏడాదిలో చింతూరు ఏరియా ఆసుపత్రికి రూ.18లక్షల విలువగల వైద్య సహాయక సామగ్రిని సమకూర్చామన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డా.రమణారావు, చిన్నపిల్లల వైద్యుడు హర్ష, హెడ్ నర్స్ కె.కుమారి పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

అన్నవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణ, మూలమంత్ర జపాలు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలు అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల ఆశీర్వచనాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా హనుమద్ వ్రతాలు

ప్రత్తిపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం హనమద్ వ్రత వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు వేణుగోపాలసామి ఆలయంవద్ద ఉన్న ఆంజనేయ విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్థానికులు పూజలు నిర్వహించారు. రాచపల్లి, ధర్మవరంలోని హనుమాన్ ఆలయాలవద్ద హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించారు. ధర్మవరం జువ్వల వారి రామాలయంవద్ద ఆంజనేయ విగ్రహానికి పూజలు నిర్వహించి స్థానికంగా విఘ్నేశ్వర, గౌరీశం కరజ్ఞాన, సాయి దుర్గ మహిళా భక్తజన సమాజాలు ఏకాహం నిర్వహించాయి. ఈ భజన సమాజాలకు స్థానిక రంగస్థల నాటక కళాకారులు ఎస్. నూకరాజు, సూరిబాబు, హైస్కూల్ స్థల దాత అద్దేపల్లిరాజా ఘనంగా సత్కరించారు. జువ్వల మణీంద్ర, రజిత దంపతులు పీటలపై కూర్చుని హనుమద్ వ్రతం నిర్వహించారు.

ఏలేశ్వరం: మండలవ్యాప్తంగా హనుమద్వ్రతాన్ని శుక్ర వారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిర్డినగర్‌లోని ఆంజనేయస్వామికి కోరాడ శ్రీనివాస్‌సుగుణ దంపతులు సింధూర అభిషేకం, తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వహిందూపరిషత్ సభ్యులు హనుమాన్ వ్రతపారాయణ పఠనం చేశారు. యర్రవరం, జె.అన్నవరం, భద్రవరం, లింగంపర్తి గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గూడవిల్లి అర్జునరావు, రమణారావు,దేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

ప్రత్తిపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతి చెప్పారు. మండలంలోని వెంకట్‌నగరం, తోటపల్లి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో డీటీ పుణ్యవతి మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ అవసరాల గోపాలకృష్ణ, విలేజ్ సర్వేయర్ మణికంఠ, వెంకటనగరం గ్రామపెద్ద బాబి, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి రోమాల అప్పలరాజు పాల్గొన్నారు.

జాతీయ కాపు సంఘం రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడిగా సూరపురెడ్డి



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

తుని పట్టణానికి చెందిన సూరపురెడ్డి శ్రీనివాస్‌కి జాతీయ కాపు సంఘం కీలక పదవి దక్కింది. జాతీయ కాపు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ నియమితులయ్యారు. శుక్రవారం మంగళగిరిలో జాతీయ కాపు సంఘం కేంద్ర కార్యాలయంలో జాతీయ కాపు సంఘం అధ్యక్షుడు కన్న మురళీకృష్ణంనాయుడు, ఉపాధ్యక్షుడు మేడిశెట్టి శేషగిరిలు శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. జాతీయ కాపు సంఘం రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడిగా ఎంపికైన సూరపురెడ్డి శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.